ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
శనివారం 4 జనవరి 2025

ఇంటర్ విద్యార్థులకు
నేటి నుంచి మధ్యాహ్న భోజనం

కడప ఎడ్యుకేషన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో టీడీపీ ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు భోజనం అందించగా వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. ఈ పథకం వల్ల దూర ప్రాంతాల నుంచి కళాశాలలకు వచ్చే విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని భావిస్తున్న కూటమి ప్రభుత్వం ఈనెల 4వ తేదీ నుంచి మళ్లీ ప్రారంభించాలని నిర్ణయించింది. జిల్లాలోని 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గల 5,149 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించనున్నారు. వీరిలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 2,906 మంది చదువుతుండగా బాలురు 1,136 మంది, బాలికలు 1,770 మంది ఉన్నారు. ద్వితీయ సంవత్సరం 2,243 మంది ఉండగా వీరిలో బాలురు 738 మంది, బాలికలు 1,505 మంది ఉన్నారు. వీరందరికీ శనివారం నుంచి మధ్యాహ్నం భోజనం ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది.



రేపే ముగ్గుల పోటీలు



కడప, రాయచోటి, రాజంపేటల్లో..

ఆంధ్రజ్యోతి ఏటా సంక్రాంతికి ముందు నిర్వహించే ముత్యాల ముగ్గుల పోటీలు రేపు జరగనున్నాయి. తెలుగు సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణలో భాగంగా నిర్వహిస్తున్న ఈ పోటీలు కడప, రాయచోటి, రాజంపేట కేంద్రాల్లో ఆదివారం జరుగుతాయి. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు..గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టవారి పర్‌ఫెక్ట్, ప్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సౌజన్యంతో పై మూడు కేంద్రాల్లో జరుగుతాయి. కడప నగరంలో ఐటీఐ దగ్గర వికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో, రాయచోటిలో గాలివీడు రోడ్డులోని ఎగువఅబ్బవరం వద్ద ఉన్న అర్చన కాలేజీలో, రాజంపేటలో శాన్వీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పోటీలు ఉంటాయి. పోటీల్లో పాల్గొనదలచిన మహిళలు ఉదయం 9 గంటలకే పోటీలు నిర్వహించే మైదానాల వద్దకు చేరుకుని తమ పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. పోటీలు జరిగే ప్రతి కేంద్రంలో మొదటి, రెండు, మూడు బహుమతులు ఉంటాయి. ఈ మూడు కేంద్రాల్లో ప్రథమ బహుమతి పొందిన ముగ్గురిలో ఒకరిని జిల్లా విజేతగా ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతారు. ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల విజేతలు, కర్ణాటక, తమిళనాడు నుంచి ఎంపికైన ఇద్దరు, మొత్తం 15 మందికి జనవరి 11వ తేదిన విజయవాడలో ఫైనల్ పోటీలు ఉంటాయి. కడపలో జరిగే పోటీలకు వికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, రాయచోటిలో జరిగే పోటీలకు అర్చన కాలేజీ, రాజంపేటలో జరిగే పోటీలకు శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్నాయి.

- ఆంధ్రజ్యోతి, కడప

ఖాళీలు భర్తీ అయ్యేనా..?

- ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో 466 పోస్టులకు..
- పని చేస్తున్నది 215 మంది మాత్రమే.. 251 పోస్టులు ఖాళీ
- సిబ్బంది లేక పరిపాలనకు ఇబ్బందులు
- పట్టణంలో కుంటుపడుతున్న అభివృద్ధి పనులు

ప్రొద్దుటూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో దాదాపు రెండు లక్షలకు పైగా జనాభా ఉంది. 41 ఎలక్షన్ వార్డులు ఉన్నాయి. 46 వార్డు సచివాలయాలు మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్నాయి. కోట్ల రూపాయల బడ్జెట్ ఉండే ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు అవసరమైన సేవలందించేందుకు మున్సిపల్ కార్యాలయంలో తగినంతమంది అధికారులు, సిబ్బంది లేక అవస్థలు పడుతున్నారు. మున్సిపాలిటీలోని పలు విభాగాల్లో అధికారులు, సిబ్బంది ఖాళీలు ఉన్నాయి. దీంతో పరిపాలనలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

ముఖ్యంగా కమిషనర్ తరువాత అంత కీలకమైన బాధ్యతలు నిర్వహించే అసిస్టెంట్ కమిషనర్ లేక చాలా కాలమైంది. అలాగే కార్యాలయంలో మేనేజర్ పోస్టు సైతం ఖాళీగా ఉంది. ఇంజనీరింగ్ విభాగంలో కీలకమైన మున్సిపల్ ఇంజనీర్ ఈఈ క్యాడర్ అధికారి బదిలీపై వెళ్లిపోయారు. ఆయన స్థానంలో ఇంకా ఎవ్వరూ రాలేదు. ప్రస్తుతం డీఈ దస్తగిరికే మున్సిపల్ ఈఈగా ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇచ్చారు. వెంటనే మున్సిపల్ ఇంజనీర్ పోస్టును భర్తీ చేయాల్సి ఉంది. డీఈలు ముగ్గురు ఉన్నారు. ఏఈలు 6గురు ఉండాల్సి ఉండగా నలుగురు మాత్రమే ఉన్నారు.

- టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఇద్దరు ఏసీపీలకు గాను ఒక్కరే ఉన్నారు. టౌన్ ప్లానింగ్ ఆఫీసులో టీపీవో ఉన్నప్పటికి టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ పోస్టులు 3 ఖాళీగా ఉన్నాయి. టీపీబీవోల పోస్టులు నాలుగూ ఖాళీగా ఉన్నాయి. వీరి స్థానంలో వార్డుప్లానింగ్ సెక్రటరీలను కార్యాలయంలో వినియోగించుకుంటున్నారు. టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లో ట్రేసర్ లేడు. సీనియర్ అసిస్టెంటు ఉండగా అతను ఇటీవల సస్పెండ్ అయ్యాడు. జూనియర్ అసిస్టెంట్ ఒకరు ఉన్నారు.
- రెవెన్యూ సెక్షన్‌లో ఆర్‌వో, ఆర్‌ఐలు ఉన్నారు. కానీ సెక్షన్‌లో ఇదివరకు ఉన్న బిల్ కలెక్టర్లు 12 మంది లేరు. వీరి స్థానంలో వార్డు అడ్మిన్‌లు పన్నులు రాబడుతున్నారు. 13 మంది రికార్డు అసిస్టెంట్‌లకు గాను కేవలం ఒక్కరు మాత్రమే ఉన్నారు. 12 మంది రికార్డు అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జీఐఎస్ ఆపరేటర్-1, క్యాడ్ ఆపరేటర్-1, హార్టికల్చర్ ఆఫీసర్-1 పోస్టులు ఖాళీ ఉన్నాయి.
- శానిటేషన్ విభాగంలో నలుగురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉన్నా.. శానిటరీ సూపర్‌వైజర్ పోస్టు మాత్రం ఖాళీ ఉంది. ముగ్గురు హెల్త్ అసిస్టెంట్‌లలో ఒక పోస్టు ఖాళీ. మున్సిపాలిటీలో హెల్త్ ఆఫీసర్ సైతం లేరు. మెడికల్ ఆఫీసర్‌తోపాటు, ఉమెన్ మెడికల్ ఆఫీసర్ నర్సింగ్ సిబ్బందిలో మేల్ ఫిమేల్ నర్సులు ఖాళీ. ఇద్దరు ఫార్మసిస్టులు సైతం లేరు.
- కీలకమైన అకౌంటెంట్ విభాగంలో ముగ్గురు జూనియర్ అకౌంటెంట్లకు ఒక్కరు కూడా లేరు. జూనియర్ అసిస్టెంట్ ఒకరికి అకౌంటెంట్‌గా డిప్యుటేషన్ వేశారు. అలాగే సీనియర్ అకౌంటెంటుతో పాటు ఇక్కడ అకౌంట్స్ ఆఫీసర్, అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ పోస్టులు సైతం ఖాళీ ఉన్నాయి. దీంతో అకౌంటెంట్ విభాగంలో పరిస్థితి దారుణంగా ఉంది. కేవలం ఒక్క సీనియర్ అకౌంటెంట్ తప్ప ఆ సెక్షన్‌లో ఉండాల్సిన కీలక అధికారులు లేరు. ఇందువల్ల బిల్లులు చేయడంలో ఇబ్బందులు తప్పడం లేదు. అలాగే రోడ్ గ్యాంగ్ లేబర్‌లు 28 మందికిగాను 10 మంది మాత్రమే ఉన్నారు. అటెండర్లు 17 మందికి గాను 14 మంది ఉన్నారు. పార్కు కూలీలు 11 మందికి ఐదుగురే ఉన్నారు. క్లీనర్లు 12 మందికి నలుగురు ఉన్నారు. నైట్‌వాచ్‌మెన్‌లు 9 మందికి నలుగురు ఉన్నారు.



- వాటర్‌వర్క్సు సెక్షన్‌లో 10 మంది ఫిట్టర్ కూలీలు ఉండాలి. అయితే 5గురు మాత్రమే ఉన్నారు. టర్న్‌కాక్‌లు నలుగురికి ఒకరు ఉన్నారు. హెల్పర్‌లు ఏడుగురికి ఒక్కరు మాత్రమే ఉన్నారు. నాన్ పీహెచ్ వర్కర్లు ముగ్గురుకి ఇద్దరు ఉండగా ఒకటి ఖాళీ. పబ్లిక్ హెల్త్ మేస్త్రీలు 10 మందికి ఐదుగురు ఉన్నారు. డ్రైవర్లు 12 మందికి ఒక్కరే ఉన్నారు. ట్రాక్టర్ క్లీనర్-2, ఫిట్టర్-2, డ్రైన్‌క్లీనర్- 24, పబ్లిక్ హెల్త్ వర్కర్లు -22, స్వీపర్లు-34, ట్రాక్టర్ వర్కర్లు-10, మలేరియా వర్కర్లు-3, స్టెనోగ్రాఫర్-1, సిస్టమ్ మేనేజర్-1, సిస్టమ్ అసిస్టెంట్-1, ఆయా-2, వాటర్ మెన్- 2, పైప్‌లైన్ పిట్టర్-2 ఖాళీలు ఉన్నాయి.

మొత్తం మున్సిపాలిటీలో 466 పోస్టులకు గాను 215 మంది పనిచేస్తున్నారు. 251 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీరు కాక ఔట్ సోర్సింగ్ కింద పబ్లిక్ హెల్త్ వర్కర్లు 244 మంది, నాన్ పిచ్ కింద 104మంది పనిచేస్తున్నారు. మెయిన్ ఆఫీసులో మరో నలుగురు టౌన్‌ప్లానింగ్‌లో 6గురు కలిపి ఔట్ సోర్సింగ్ కింద పనిచేస్తున్నారు. వీరు కాక ఇంకా నగరదీపికలు పేర 25 మంది, కొవిడ్ తాత్కాలిక వర్కర్లు 93 మంది పనిచేస్తున్నారు. వీరికి కూడా నెలకు రూ.12,000 వంతున చెల్లిస్తున్నారు. ఔట్ సోర్సింగ్ కింద పనిచేసే మొత్తం 359 మందికి కలిపి నెలకు రూ.77 లక్షలు, తాత్కాలిక నగర దీపికలకు కొవిడ్ వర్కర్లకు నెలకు రూ.11 లక్షల మేర జీతాలు చెల్లిస్తున్నారు. రెగ్యులర్ ఉద్యోగులకు 010 పద్దులో ప్రభుత్వమే జీతాలు చెల్లిస్తున్నది. మొత్తం మీద ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో ఉండాల్సిన ఉద్యోగుల్లో సగం మంది కూడా లేకపోవడంతో ఇక్కడ ప్రజలకు ప్రభుత్వ పరంగా సరైన సేవలు అందడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో ఖాళీలను భర్తీ చేయాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

పెరిగిన మధ్యాహ్న భోజనం మెనూ చార్జీలు

కడప ఎడ్యుకేషన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు పంపింది. ప్రస్తుతం పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజనం మెనూ చార్జీలు పెంచింది. దీనితో విద్యార్థులకు మరింత నాణ్యమైన భోజనం అందనుంది. నిర్వాహకులకు ఊరట లభించనుంది.

జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 1589, ప్రాథమికోన్నత 111, ఉన్నత పాఠశాలు 218 ఉన్నాయి. వీటిలో మొత్తంగా 1,13,364 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిధులు కేటాయించి మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నాయి. కేంద్రం 60శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం నిధులు కేటాయిస్తోంది. కేంద్ర ప్రభుత్వం 2022 సెప్టెంబరులో మెనూ ధరలను పెంచింది. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాల విద్యార్థికి రూ.5.88, ఉన్నత పాఠశాల విద్యార్థికి రూ.8.57 చొప్పున నిర్వాహకులకు నిధులు అందజేస్తోంది. కాగా ప్రస్తుతం మార్కెట్లో పప్పులు, నూనె, కూరగాయలు, ఇతర నిత్యావసర ధరలన్నీ పెరిగాయి. దీనితో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని, మెనూ చార్జీలు పెంచాలని నిర్వాహకులు కొన్నాళ్ల నుంచి డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి మెనూ చార్జీలు స్వల్పంగా పెంచింది. ఇకపై ప్రాథమిక పాఠశాల విద్యార్థికి రూ.6.19, ఉన్నత పాఠశాల విద్యార్థికి రూ.9.29 చొప్పున అందించనుంది. దీనితో విద్యార్థులు, నిర్వాహకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రిజర్వుఫారెస్టు భూములపై కొనసాగుతున్న సర్వే

కడప, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సీకే దిన్నె మండలంలో సజ్జల కుటుంబీకులు అటవీశాఖ భూములను ఆక్రమించేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వీటి గుట్టు రట్టు చేసేందుకు రెవెన్యూ, ఫారెస్టు ఆధ్వర్యంలో సర్వే నిర్వహిస్తున్నారు. శనివారం మరోసారి జాయింట్‌గా సర్వే నిర్వహించనున్నారు. సజ్జల భూఆక్రమణలు రాష్ట్రంలోనే సచలనంగా మారాయి. అటవీ భూములపై పూర్తి నివేదిక ఇవ్వాలంటూ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఆదేశించారు. ఈ భూముల వ్యవహారం అందరికి తెలిసిన విషయమే. 52ఎకరాలు ఫారెస్టు భూములు ఆక్రమణకు గురైనట్లు రెవెన్యూ అధికారులు ప్రాథమిక రిపోర్టు తయారుచేసినట్లు సమాచారం. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అటవీశాఖ, రెవెన్యూ ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. అయితే భూ ముల అన్యాక్రాంతంలో అటవీశాఖ అధికారుల పూర్తి వైఫల్యం ఉందని అంటున్నారు. సర్వే పూర్తయితే నివేదికను ప్రభుత్వానికి పంపించనున్నారు.

నేడు 23 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

కడప కలెక్టరేట్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 23 గ్రామాల్లో శనివారం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బద్వేలు రెవెన్యూ డివిజన్‌లోని బి.కోడూరు మండలం బోడుగుండుపల్లి, కలసపాడులో ముసలరెడ్డిపల్లె, ఇటుకులపాడు, పోరుమామిళ్లలోని వీఎస్‌పల్లి, ఎస్ లింగంపల్లిలో రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తెలిపారు.

పులివెందుల రెవెన్యూ డివిజన్‌లోని చక్రాయపేట, లింగాలలోని వడ్లవానిపల్లి, సింహాద్రిపురంలోని నిడివెలగల, పులివెందుల మండలంలోని కనంపల్లిలో నిర్వహిస్తారని వివరించారు. ఇక జమ్మలమడుగు డివిజన్‌లో రాజుపాలెం, రామచంద్రాపురం, ప్రొద్దుటూరు మండలం రంగసాయిపురం, మైలవరంలోని పొన్నంపల్లి, పెద్దముడియంలోని పాపాయిపల్లి, కొండాపురంలోని మురుగంపల్లి, సంకేపల్లి, జమ్మలమడుగులోని కొత్తగుంటపల్లి, ముద్దనూరులోని రాజులగురవాయిపల్లి, దువ్వూరులోని అన్నపుశాస్త్రాల పల్లి, చాపాడులోని బద్రిపల్లిలో రెవెన్యూ సదస్సులు జరుగుతాయి. అలాగే కడప డివిజన్ పెండ్లిమర్రిలోని చిన్నదాసరి పల్లి, సీకే దిన్నెలోని బాలుపల్లి, కమలాపురంలోని మీరాపురం.. వెరసి మొత్తం 23 గ్రామాల్లో శనివారం రెవెన్యూ సదస్సులు జరుగుతాయని ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో కోరారు.

ప్రభుత్వ భూమిని
స్వాధీనం చేసుకుంటాం

- ప్రొద్దుటూరు తహశీల్దారు
- ఆంధ్రజ్యోతి కథనంతో కదలిన రెవెన్యూ యంత్రాంగం
- ఆక్రమణల సర్వేనివేదిక కలెక్టరుకు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ప్రొద్దుటూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమి ఒక్క సెంటు కబ్జాకు గురైనా వదిలేది లేదని చట్టప్రకారం ఆ భూమిని స్వాధీనం చేసుకుంటామని తహశీల్దారు గంగయ్య హెచ్చరించారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన 'కళ్లెదుటే కబ్జా' కథనంతో రెవెన్యూ యంత్రాంగం కదిలింది. తహశీల్దారు గంగయ్య, ఆర్ఐ నాగమోహన్‌రెడ్డి, మండల సర్వేయర్ వెంకటలక్ష్మి, విలేజ్ సర్వేయర్లతో కలిసి స్థానిక బొల్లవరంలోని ప్రభుత్వ ఆక్రమిత స్థలాలను పరిశీలించారు. సర్వేనెంబరు 506లో 85 సెంట్లు, 569 బీ లోని 1.26 ఎకరాల భూమికి కొలతలు వేశారు. 506 ఆర్ఎస్ఆర్ ప్రకారం దొంతి రెడ్డివెంకటరెడ్డి పేర మాన్యువల్ అడంగల్ ఫసలీ 1400 నుంచి 1402 లలో ఉంది. ఇతని ఖాతా నెంబరు 467గా ఉంది. అయితే2016లో ఈ సర్వేనెంబరులోని 85 సెంట్ల డాటడ్ ల్యాండును ఏడబ్ల్యూ ల్యాండ్‌గా మార్చి నిషేధిత భూముల జాబితా 22(ఏ)లో పెట్టారు. ఈ సర్వేనెంబరు ను ప్రభుత్వ జీవో నెంబరు 152 ప్రకారం 27 మార్చి 2023న డీనోటిఫై చేశారు. ఏడబ్ల్యూ ల్యాండ్‌తో పాటు రస్తా పోరంబోకు భూముల్లో ఎంతెంత ఆక్రమణలకు గురయింది, ఎవరు ఆక్రమించింది, ఎన్ని కట్టడాలు ఉన్నది సమగ్రంగా నివేదికను కలెక్టర్‌కు పంపినట్లు తహశీల్దారు గంగయ్యతెలిపారు. సర్వే రిపోర్టు ప్రకారం సర్వే నెంబరు 506లోని ఏడబ్ల్యూ ల్యాండ్‌లో 85 సెంట్లలో 55 సెంట్ల మేర కొందరు ఆక్రమించి 15 గృహాలను నిర్మించుకున్నారన్నారు. 6సెంట్లు ముస్లిం కమ్యూనిటీ శ్మశాన వాటిక ఆక్రమణలో ఉన్నట్టు గుర్తించారు. మరో 11 సెంట్ల మేర యనమల రామసుబ్బారెడ్డి అనే వ్యక్తి ఆక్రమించి కాంపౌండ్ వాల్ నిర్మించారు. మరో మూడు సెంట్లలో రోడ్డు ఉన్నట్లు గుర్తించారు. 569 బీ సర్వేనెంబరు రస్తా పోరంబోకు స్థలం 45 సెంట్ల మేర మున్సిపల్ ప్లాట్లలో కలిసి ఉందని తెలిపారు. 9.77 సెంట్ల భూమి ముస్లింశ్మశాన వాటికలో ఉన్నదని గుర్తించారు. 4.98 సెంట్లలో రెండు గృహాలు, 2.16 సెంట్లు సిమెంట్‌రోడ్డు, 0.75 సెంట్లు బావి, 63.84 సెంట్ల మేర ఖాళీ స్థలం ఉన్నట్లు నివేదికలో పొందుపరిచారు. ప్రభుత్వ భూమిలో ఉన్న ఆక్రమిత కట్టడాలకు నోటీసులు ఇచ్చి వాటిని తొలగించేందుకు మున్సిపల్ కమిషనర్‌తో కలిసి చర్యలు తీసుకుంటామన్నారు. సెంటుభూమి కూడా అన్యాక్రాంతం కాకుండా రక్షిస్తామని తహశీల్దారు తెలిపారు.


ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న తహశీల్దారు గంగయ్య, ఆర్ఐ, సర్వేయర్లు

వర్గీకరణతోనే సామాజిక న్యాయం

- ఏకసభ్య కమిషన్‌కు విన్నవించిన ఎమ్మార్పీఎస్
- ఎస్సీలను వర్గీకరించొద్దని మాలల వినతి

కడప ఎన్టీఆర్ సర్కిల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాల వర్గీకరణతోనే సామాజిక న్యాయం చేకూరుతుందని ఎమ్మార్పీఎస్ నేతలు ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ ఛైర్మన్‌కు విన్నవించారు. దశాబ్దాలుగా ఐకమత్యంగా ఉన్న తమను రిజర్వేషన్ల వర్గీకరణ పేరుతో విడదీయొద్దంటూ మాలమహానాడు సంబంధిత ప్రజాసంఘాల నాయకులు ఏకసభ్య కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు.


షెడ్యూల్డ్ కులాల వర్గీకరణపై అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని శుక్రవారం కలెక్టరేట్‌లోని సభాభవనంలో నిర్వహించారు. ముందుగా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అధికారుల సమావేశంలో ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ రాజీవ్‌రంజన్ మిశ్రా.. విద్యా, ఉద్యోగాల పరంగా, వివిధ రకాల ప్రభుత్వ పథకాల పరంగా లబ్ధిపొందుతున్న షెడ్యూల్డ్ కులాల లబ్ధిదారుల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులతో ఆయన మాట్లాడారు. అనంతరం వివిధ కుల సంఘాల నాయకుల నుంచి అభిప్రాయాలను, వినతులను స్వీకరించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు అభిప్రాయ సేకరణ, వినతుల స్వీకరణ చేపట్టారు.

వర్గీకరణకు మద్దతుగా..

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితితో పాటు వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు ఒక్కసారిగా అధిక సంఖ్యలో రావడంతో సభాభవన్‌లో వారిని కూర్చోబెట్టి అభిప్రాయాలు సేకరించారు. మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పి.బాబు మాట్లాడుతూ రిజర్వేషన్లలో అధిక సంఖ్యలో మాలలే లబ్ధిపొందారని వివరించారు. మాదిగలు చేస్తున్న కులవృత్తుల వల్ల సమాజంలో అస్పృశ్యతకు గురవుతున్నారని అన్నారు. అనేక కమిషన్ల ఎదుట ఈ అంశాలను విన్నవించామన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్లను జనాభా ప్రాతిపదికన వర్గీకరించాలన్నారు. బీసీల మాదిరిగా ఏబీసీడీలతో విభజించాలన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు రాజు మాట్లాడుతూ తరతరాలుగా మాదిగలు మాత్రమే వెనుకబడి ఉన్నారన్నారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు చిన్న సుబ్బయ్య మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు తాము సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని తెలిపారు. బేడ బుడగ జంగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండయ్య మాట్లాడుతూ గతంలో తమకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రం ఇచ్చేవారని, ఇపుడు దానిని ఇవ్వకుండా రద్దుచేశారని వాపోయారు.

ఎస్సీలను వర్గీకరించకండి..

భారత రాజ్యాంగం ఎస్సీల కోసం ప్రవేశపెట్టిన రిజర్వేషన్లను వర్గీకరించవద్దంటూ మాల మహానాడుతో పాటు పలు సంఘాల ప్రతినిధులు ఏకసభ్య కమిషన్ ఛైర్మన్‌కు వినతిపత్రాలు అందజేశారు. అదేవిధంగా కలెక్టరేట్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి కూడా వారు వినతిపత్రాన్ని అందజేసి ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ వద్దు, ఎస్సీల ఐక్యత వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. ఎమ్మార్పీఎస్ పలు అనుబంధ సంఘాలు ఆర్టీసీ కూడలిలోని అంబేడ్కర్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద వీరిని పోలీసులు అడ్డుకున్నారు. ఒకానొక సందర్భంలో మాలలు, మాదిగలు రిజర్వేషన్లపై తమ డిమాండ్లను వ్యక్తపరిచే క్రమంలో వివాదం తలెత్తే అవకాశాలు కూడా కనిపించాయి. అయితే పోలీసులు ఎక్కడికక్కడే జనాలను గుమిగూడకుండా చర్యలు తీసుకున్నారు. అభిప్రాయ సేకరణలో కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్, జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ విద్యాసాగర్, జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.


ఎస్సీ వర్గీకరణపై వినతులు స్వీకరిస్తున్న ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ రాజీవ్‌రంజన్ మిశ్రా.. చిత్రంలో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ తదితరులు


దివ్యాంగుడి నుంచి వినతిపత్రం తీసుకుంటున్న ఏకసభ్య కమిషన్ ఛైర్మన్

మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులకు
పీఈటీ పరీక్షలు

- 713 మందికి గాను 345 మంది హాజరు

కడప క్రైం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): స్టైఫెండరీ మహిళా పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాలకు ప్రాథమిక రాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు పీఎంటీ మరియు పీఈటీ పరీక్షలను శుక్రవారం నిర్వహించామని ఇన్‌చార్జి ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. 713 మంది హాజరు కావాల్సి ఉండగా 345 మంది మహిళా అభ్యర్థులు హాజరయ్యారన్నారు. 195 మంది క్వాలిఫై అయ్యారన్నారు. నియమాకాల ప్రక్రియ వేకువజామున 5గంటల నుంచే ప్రారంభం అయిందన్నారు. మహిళా అభ్యర్థులకు పీఎంటీ మరియు పీఈటి పరీక్షలు నిర్వహించేందుకు ప్రత్యేకంగా మహిళా పోలీసు సిబ్బందిని నియమించామని ఎస్పీ తెలిపారు. అభ్యర్థులకు ముందుగా హాల్‌టికెట్స్ పరిశీలించి డీటీసీ గ్రౌండులోకి అనుమతించారు. అనంతరం అభ్యర్థుల విద్యార్హతలు, రిజర్వేషన్లు, వయసు నిర్ధారించే ధ్రువపత్రాలు పరిశీలించి అన్నీ సక్రమంగా ఉన్న వారివి మాత్రమే బయోమెట్రిక్ తీసుకుని పీఎంటీ పరీక్షలకు అనుమతించామన్నారు. ఈ ప్రక్రియలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ రమణయ్య, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.


పరుగు పందెంలో మహిళా అభ్యర్థులు

మూఢ విశ్వాసాలపై సమరం



చేతులకు మంటలు అంటించుకుని విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పల్లవోలు రమణ

- కుల నిర్మూలనతోనే అసమానతల తొలగింపు
- శాస్త్రీయ దృక్పథంతో ప్రజల్లో చైతన్యం
- నాస్తిక సమాజం జిల్లా కన్వీనర్ పల్లవోలు రమణ
- నేడు, రేపు విజయవాడలో ప్రపంచ నాస్తిక మహాసభలు



ప్రొద్దుటూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అతను బాల్యంనుంచే ప్రజా నాట్యమండలి కళాకారుల వెంట తిరుగుతూ పాటలు పాడటం నేర్చుకున్నాడు. హైస్కూలు స్థాయి నుంచే కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమాల్లో కార్యకర్తగా పనిచేస్తూ కళాకారుడుగా గాయకుడుగా ఎదిగాడు. ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడిగా సైతం పనిచేశాడు. సీపీఐలో పనిచేసేటప్పుడు మనుషుల మధ్య ఉండే ఆర్థిక అసమానతలు తొలగిపోయే పోరాటాలపై చైతన్యం పెంపొందించుకున్నాడు. మూఢనమ్మకాలను అంధవిశ్వాసాలను మనుషుల అంతరాల్లోంచి తొలగించనిదే మనిషి మానవీయంగా ఎదగడని అర్థం చేసుకున్నాడు. తాను నాస్తికునిగా హేతువాదిగా మారాడు. విద్యార్థుల్లో, ప్రజల్లో శాస్త్రీయ భావాలు పెంపొందించేందుకు మూఢనమ్మకాలను అంధవిశ్వాసాలను పారదోలేందుకు కంకణం కట్టుకున్నాడు. ఆయన పేరే కటారు వెంకటరమణ అలియాస్ పల్లవోలు రమణ. విజయవాడలో శని, ఆదివారాల్లో ప్రపంచ నాస్తిక మహాసభలు జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి వెళుతున్న జిల్లా నాస్తిక సమాజం కన్వీనర్ పల్లవోలు రమణ ప్రస్థానం గురించి.. ఆయన మాటల్లోనే..

ఆదెమ్మ పాటలతో..

మాది మైదుకూరు నియోజకవర్గం చాపాడు మండలం పల్లవోలు గ్రామం. మాది వ్యవసాయ కుటుంబం. నా చిన్నతనం నుంచి మావూర్లో కమ్యూనిస్టు పార్టీ కమిటీ ఉండేది. మానాన్న వెంకటయ్య ఆ పార్టీలో కార్యకర్తగా ఉండేవాడు. నాకు పది పన్నెండేళ్ల వయసులో మైలవరం వద్ద ఏఐవైఎఫ్ శిక్షణా తరగతులు జరుగుతుంటే మా వూరిలోని ఆదెమ్మ అక్కడికి వంట చెయ్యడానికి వెళ్లింది. అక్కడ ఆమె ప్రజానాట్యమండలి వాళ్లు పాడిన పాటలు విని వచ్చి మాకు వినిపించింది. ఆ పాటలు నన్ను ఆకర్షించాయి. నేను మొట్టమొదట విన్నది నేర్చుకున్నది "సుత్తి కొడవలి గురుతుగ ఉన్న ఎర్రని జెండా ఎగురుతున్నది" అనే పాటను. ప్రజా నాట్యమండలి వాళ్లుపాడే పాటలకు ఆకర్షితుడినై నేను డప్పు కొట్టి పాటలు పాడటం మొదలుపెట్టాను. నాతోపాటు నా సోదరులు వెంకటేశ్వర్లు గంగయ్య పాటలు పాడేందుకు వచ్చేవారు. ఆ క్రమంలో కటారు దళంగా జిల్లాలో పేరు తెచ్చుకున్నాం. పాటలు పాడే రమణ నుంచి పల్లవోలు రమణగా పేరు వచ్చింది.

కమ్యూనిస్టుగా..

కమ్యూనిస్టు పార్టీలో చిన్నప్పటి నుంచి సభ్యుడిగా ఉన్నాను. ఏటుకూరి బలరామమూర్తి సురవరం సుధాకర్‌రెడ్డి, నల్లమల్ల గిరిప్రసాద్, శివరామిరెడ్డి లాంటి వాళ్లక్లాసులు విన్నాను. కానీ నాకు ఆ పార్టీ సిద్ధాంతాలు, రాజకీయాలు పెద్దగా బోధపడలేదు. అంతేకాక నిత్య జీవితంలో ఎదురయ్యే దేవుడు దయ్యం మూఢనమ్మకాలు అంధవిశ్వాసాలపై సీపీఐలో చెప్పలేదు. పేదల పక్షం ఉండే పార్టీగా మాత్రమే తెలుసు. నేను కొంతకాలం పత్రికల్లో చాపాడు మండల కంట్రీబ్యూటర్‌గా పనిచేశాను. ఆ తరువాత వ్యవసాయం చేశాను. వ్యవసాయ బోర్లు వేసే పనికి పోతూ బోర్లు వేసే మేస్త్రీగా ఎదిగాను. బోర్లు వేసే క్రమంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో అనేక గ్రామాలు తిరిగాను. మా వూర్లో మనుషుల మధ్య ఉండే కులవివక్షను గమనించాను. ఎంపీటీసీగా గెలిచిన ఒక దళితురాలు మావూర్లో పెళ్లిళ్లలో ఎంగిలి విస్తర్లు ఎత్తేది. ఈ సంఘటనలన్నీ నాలో కుల వివక్షను గురించి ఆలోచింపచేసేవి.

నాస్తిక సమాజం పరిచయంతో..

పదేళ్లక్రితం సోషల్ మీడియా ద్వారా భారత నాస్తిక సమాజం పరిచయమయింది. ఆ సంస్థ నాయకుడు జీడీ సారయ్యతో సంబంధాలు ఏర్పరుచుకున్నాను. అక్కడి నుంచి నేను అప్పటి వరకు నాస్తిక, హేతువాద భావాలు తెలుసుకోవడం మూఢనమ్మకాలపై అవగాహన పెంపొందించుకోవడం ప్రారంభించాను. కులం మతం దేవుడు దయ్యం సంప్రదాయాలు కట్టుబాట్ల నుంచి అతన్ని చైతన్య పరచాలంటే కచ్చితంగా సామాజిక చైతన్యం అందించాలి. మనం కూడా నిత్యం జీవితంలో సంఘర్షణపడాలి.

పెరియార్ ఆలోచనావిధానం

తమిళనాడు రాష్ట్రం చెన్నైలో ద్రవిడ కజకం వారు జరిపిన అంబేడ్కర్ 125 జయంతికి వెళ్లాను. అక్కడ తాళి తెంచి భర్త చేతిలో పెట్టే ఒక చైతన్య కార్యక్రమం ద్రవిడ ఉద్యమనాయకుడు వీరమణి ఆధ్వర్యంలో జరిగింది. అప్పుడు నేను తాళి అనేది స్త్రీకి ఒక బంధనం లాంటిదని అవగాహన పెంపొందించుకున్నాను. ఆ తరువాత ప్రపంచ నాస్తిక మేళా తిరుచురాపల్లిలో జరిగింది. అక్కడికి వెళ్లి పెరియార్ ఆలోచనా విధానాన్ని అర్థం చేసుకున్నాను. అప్పటి నుంచే నేను పూర్తిగా నాస్తికునిగా మారాను. గుంటూరు జిల్లా నిడమర్రులోని చార్వాక ఆశ్రమంలో హేతువాద సభలకు ప్రతి ఏడాది వెళ్లి అక్కడ జరిగే సమ్మేళనంలో పాల్గొనడం ద్వారా ఇతర రాష్ట్రాలలో ఉండే హేతువాద నాస్తికవాదులు పరిచయమయ్యారు. అలాగే కులనిర్మూన సంఘం వారు పరిచయం కావడంతో కుల అసమానతలు రూపుమాపందే సమాజంలో నిజమైన సమానత్వం రాదని గ్రహించాను. అది నా ఇంటినుంచే ప్రారంభించాలని నా కూతురు భారతీకి కులాంతర వివాహం చేశాను. తాళి తలంబ్రాలు లేకుండా నిరాడంబరంగా పెళ్లిచేశాను. నా కుమారుడు సాయి కూడ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ చదివాడు. అతన్ని నాస్తిక భావాలతోనే పెంచాను.

మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా...

మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు కళాశాలల్లో విస్తృతంగా ప్రచారం చేశాము. ముఖ్యంగా బాబాల ముసుగులో వారు చేసే మాయలు మంత్రాలలోని లోగుట్టులను బహిర్గతం చేసేవాళ్లం. చేతిలోనించి విభూదిని తీసే టెక్నిక్ చూపించే వాళ్లం. చేతులు కాలకుండా మంటలు ఎలా మండించాలో పిల్లలకు నేర్పించాం. గాలిలో మంటలు మండించడం నోట్లో నుంచి మంటలు బయటికి తీయడం లాంటివి మనకు అద్భుతంగా కనిపించే ప్రతిచర్య వెనుక ఒక శాస్త్రీయమైన విధానం ఉంటుందని బోధించాం. నిప్పుల్లో నడవడం, మ్యాజిక్‌లు చేసి చూపడం లాంటివి చేసి ప్రజల్లో మూఢనమ్మలపై విశ్వాసం తొలగించే ప్రయత్నాలు చేపట్టాం. ప్రముఖులైన హేతువాదులు సామాజికవేత్తలను పిలిపించి సభలు సమావేశాలు చర్చలు గోష్ఠులు నిర్వహించాం. జీడీ సారయ్య, బాబు గోగినేని, కదిరే క్రిష్ణ, పెన్మత్స సుబ్బరాజు, డాక్టర్ బ్రహ్మారెడ్డి, ప్రొఫెసర్ కాసీం తదితరులు మేము నిర్వహించే కార్యక్రమాలకు వచ్చారు.

సామాజిక సేవాకార్యక్రమాలు

మా అమ్మ లక్షుమ్మ మరణం తరువాత ప్రతి ఏడాది దినకర్మలు చేయడం కాకుండా ఆమె మరణించిన రోజున రక్తదాన శిబిరాలు ఏర్పాటుచేశాం. స్వయంగా నేనే 25 సార్లు రక్తదానం చేశాను. మాకు తెలిసిన వాళ్లు ఎవరు మరణించినా వారి కుటుంబాలకు నేత్ర దానంపై అవగాహన కల్పించి వారి కార్నియా దానం చేసేలా కృషి చేస్తున్నాం. అలాగే శరీరదానం నేత్రదానంపై కూడా కాలేజీల్లో అనేక చోట్ల ప్రచారం చేస్తున్నాం. వారిచేత అంగీకార పత్రాలు రాయిస్తున్నాం. తెలిసిన వారు మరణిస్తే వారి శరీరాన్ని దానం చేసేలా వారి కుటుంబ సభ్యులను ఒప్పించి శరీర దానం కార్యక్రమాలను కూడా చేస్తున్నాం.

పాటల ద్వారా ప్రజల్లో చైతన్యం

నాకు ఎలాంటి డిగ్రీ చదువులు లేవు. నా పాఠశాల, ఇంటర్ విద్య కూడా సక్రమంగా సాగలేదు. నేను పెద్ద ఉపన్యాసకున్ని, రచయితను కాదు. కానీ గాయకుడిని. పాటలు పాడటం ద్వారా సామాన్య ప్రజల్లో చైతన్యం రగిలించవచ్చనే నమ్మకం కలిగినవాడిని. అందుకే సమాజంలో ఉండే ఈ సాంఘిక దురాచారాలు, మూఢనమ్మకాలు, అంధవిశ్వాసాలు, కుల అసమానతలు కులపీడన కుల దోపిడీ పోవాలని అప్పుడే నిజమైన మార్పు వస్తుందని బలంగా విశ్వసించే వ్యక్తిని. నా శక్తి మేరకు భారత నాస్తిక సమాజం ద్వారా ఇతర విప్లవ ప్రజా సంఘాల సహకారంతో సామాజిక చైతన్యం పెంపొందించే కార్యక్రమాలు చేపడుతున్నాను.

పల్లవోలు రమణ యూట్యూబ్

'పల్లవోలు రమణ' పేరుతో యూట్యూబ్ చానల్ సైతం నిర్వహిస్తున్నాను. సామాజిక చైతన్యం పెంపొందించే సామాజిక మార్పుకోసం పనిచేసే అనేక సంఘాల సభల కార్యక్రమాలు, ఉపన్యాసాలు, ప్రముఖుల ఇంటర్వ్యూలు మా చానల్ ద్వారా ప్రసారం చేస్తున్నాం.

సచివాలయాన్ని తనిఖీ చేసిన డీపీవో

పెండ్లిమర్రి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెండ్లిమర్రి గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఉదయం కడప జిల్లా పంచాయతీ అధికారిణి రాజ్యలక్ష్మి అకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మండల కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు గ్రామంలో వాటర్ క్లోరినేషన్, ట్యాంక్ క్లీనింగ్, పంచాయతీ పన్ను వసూళ్ల తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో వాటర్ క్లోరినేషన్ తప్పనిసరిగా చేయించాలన్నారు. వాటర్ ట్యాంక్‌ను శుభ్రపరిచి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్నారు. పచాయతీలోని అన్ని ఇళ్లకు షాపులకు పన్ను వసూలు వందశాతం పూర్తయ్యేలా చూడాలన్నారు. అలాగే వర్మీకంపోస్టు ఎరువులు తయారయ్యేలా కృషిచేయాలని, పంచాయతీకి ఆదాయం వచ్చేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శివరాం రెడ్డి, గ్రామసర్పంచు నాగమల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

థింక్ రోడ్డు సేఫ్టీ పోస్టరు ఆవిష్కరించిన మంత్రి



కడప క్రైం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ చేతుల మీదుగా థింక్ రోడ్డు సేఫ్టీ పోస్టరు ఆవిష్కరణ జరిగిందని జిల్లా రోడ్డు సేఫ్టీ ఎన్‌జీవో అధ్యక్షుడు జి.రమణ పేర్కొన్నారు. మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్టు వారి అబ్జర్వెన్సీ ఆఫ్ రోడ్ సేఫ్టీ మంత్-2025లో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన కల్పించాల్సి ఉందని, ఈ కార్యక్రమంలో ఎన్జీవో సంస్థలు భాగస్వామ్యం కావాలని కోరారన్నారు. దీంతో రోడ్ సేఫ్టీపై ఎన్‌జీవో జిల్లా కమిటి తరపున ప్రచార బోర్డులు తయారు చేశామన్నారు. వాహనడ్రైవర్లు రోడ్డుభద్రతా సూచనలు తప్పక పాటించాలని, హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనదారులు వాహనాలు నడపాలని అన్నారు. ఆ మేరకు పోస్టర్లు తయారు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రోడ్డు సేఫ్టీ ఎన్‌జీవో రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఆర్.బంగారయ్య పాల్గొన్నారు.

ఆల్ ఇండియా క్యారమ్స్ పోటీలకు అంపైర్‌గా సురే కృష్ణయ్య



నందలూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో 5 నుంచి 8వ తేదీ వరకు జరిగే ఆలిండియా క్యారమ్స్ పోటీలకు అంపైర్‌గా నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సురే కృష్ణయ్య ఎంపికైనట్లు రాష్ట్ర క్యారమ్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎస్‌కే జలీల్, కడప జిల్లా క్యారమ్స్ ఛైర్మన్ పోలంకి గణేష్ తెలిపారు. మొట్ట మొదటిసారిగా జాతీయ క్యారమ్స్ పోటీలకు అంపైర్‌గా ఎంపిక కావడం ఉమ్మడి కడప జిల్లాకు, క్యారమ్స్ సంఘానికి గర్వకారణమని పలువురు ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు

పదేళ్లతరువాత హంద్రీ-నీవా బకాయిల విడుదల

కలికిరి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా పథకానికి సంబంధించి మదనపల్లె ఫేజ్-2లో 65వ ప్యాకేజీకి దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న రూ.52 లక్షల బకాయిని కూటమి ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. ఈ ప్యాకేజీకి సంబంధించిన గుర్రంకొండ మండలం ఎల్లుట్ల వద్ద ప్రతిపాదించిన డిస్ట్రిబ్యూటరీ సిస్టం కింద 15,400 ఎకరాల ఆయకట్టు లక్ష్యంగా 22 కిలోమీటర్ల పొడవునా చేసిన వివిధ రకాల పనులకు సంబంధించి రూ.52,28,324లు ప్రభుత్వం బకాయి పడింది. 2013 ఏప్రిల్-నవంబరు మధ్య ఈ పనులు జరిగాయి. అన్ని చెల్లింపులు పోనూ సాంకేతిక కారణాలతో ఈ మొత్తం ఆగిపోయింది. రాష్ట్ర స్థాయిలో ఏర్పాటయిన స్టేట్ లెవెల్ టెక్నికల్ కమిటీ (ఎస్ఎల్‌టీసీ) 2021 ఆగస్టు 12న సమావేశమై గతంలో నిలిచిపోయిన బకాయిలు చెల్లించాలని తీర్మానం కూడా చేసి ప్రభుత్వానికి ప్రతిపాదించింది. అయినా అప్పటి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. మొత్తం వ్యవహారాన్ని సమగ్రంగా క్రోడీకరిస్తూ తిరుపతి ఎన్టీఆర్ తెలుగుగంగ ప్రాజెక్టు చీఫ్ ఇంజినీరు గత సెప్టెంబరులో నిధుల విడుదల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. పరిశీలించిన ప్రభుత్వం బకాయి నిధుల విడుదల కోసం ఆమోదం తెలిపింది. ఈ మేరకు రూ.52,28,324లు విడుదల చేస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రాణాలు అడ్డుపెట్టి ఏపీఎండీసీని కాపాడుకుంటాం

- 5 డిమాండ్లతో కార్మికుల సమ్మె సైరన్

ఓబులవారిపల్లె, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రాణాలు అడ్డుపెట్టి అయినా ఏపీఎండీసీని కాపాడుకుంటామని కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. ఐదు డిమాండ్లను పరిష్కరించాలని అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ వద్ద దశలవారీగా నిర్వహిస్తున్న ఆందోళనలో భాగంగా శుక్రవారం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మిక యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఇటీవల ఏపీఎండీసీ యాజమాన్యం ఆహ్వానించిన సీ అండ్ డీ, డబ్ల్యూ గ్రేడ్ టెండర్లతో సంస్థ మనుగడకే ప్రమాదం ఏర్పడేలా ఉందన్నారు. ప్రస్తుతం సీ అండ్ డీ గ్రేడ్ టన్ను ధర రూ.1600 ఉండగా, ఏపీఎండీసీ యాజమాన్యం మాత్రం టన్నుకు కేవలం రూ.1188తో 60 లక్షల టన్నులకు టెండరు పిలవడం వెనుక అంతర్యమేమిటని ప్రశ్నించారు. దీంతో సుమారు 700 మంది కార్మికుల భవిష్యత్ అంధకారంలోకి వెళుతుందని, వెంటనే ఈ టెండరును ఆపాలని డిమాండ్ చేశారు. గ్రామ కమిటీతో చేసుకున్న ఒప్పందం ప్రకారం యాజమాన్యం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. పర్మనెంట్ ఉద్యోగులకు ప్రమోషన్, రివైజ్డ్ పే అమలు చేయాలని కోరారు. బెనిఫికేషన్ ప్లాంటు ఏర్పాటు చేసి సంస్థను లాభాల బాటలో నడిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. లాభాల సొమ్మును ఏం చేశారో చెప్పకుండా 5 వేల కోట్ల రూపాయలకు సంస్థ ఆస్తులను అమ్మాలని చూడడం దారుణమని, వెంటనే ఆ చర్యలను విరమించాలని డిమాండ్ చేశారు. 15వ తేదీలోపు సమస్యలు పరిష్కరించకుంటే 16వ తేదీన నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అన్ని యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.



ఏపీఎండీసీ పరిపాలన భవనం ముందు నల్లరిబ్బన్లతో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు

ఉచిత ఇసుక విధానం పక్కాగా అమలు చేయండి

- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప కలెక్టరేట్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానం పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నూతన ఇసుక పాలసీ, ఇసుక బుకింగ్ సరఫరా, ఇసుక లభ్యత, పట్టా ల్యాండ్స్ వంటి అంశాలపై అమరావతి నుంచి గనులు భూగర్భ శాఖ కార్యదర్శి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, గనులు భూగర్భశాఖ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గనుల భూగర్భ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేశ్ కుమార్ మీనా మాట్లాడుతూ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు సూచనల మేరకు ఉచిత ఇసుక పాలసీని మరింత మెరుగు పరచాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత ఇసుక పాలసీ, ఆన్‌లైన్, రిజిస్ట్రేషన్, శాండ్ పోర్టల్ బుకింగ్ యాప్‌పై అవగాహన పెంచాలన్నారు. సెమీ మెకనైజ్డ్ రీచ్ సమస్యలను పరిష్కరించి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఉచిత ఇసుక పాలసీ పై ప్రజల నుండి ఫీడ్‌బ్యాక్ సేకరించాలన్నారు. మాన్యువల్ రీచుల దగ్గర ఇసుక పంపిణీ సజావుగా జరగాలన్నారు. ఆయా జిల్లాలో ఇసుక ధరలను కలెక్టర్‌లు పర్యవేక్షించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పారదర్శకంగా పంపిణీ జరగాలన్నారు. సెమీ మెకనైజ్డ్ ఇసుక రీచ్‌లను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

సృజనాత్మకతమైన ఆలోచనలు చేయాలి

కడప ఎడ్యుకేషన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు భవిష్యత్తు నిర్మాణానికి పునాదులు కావాలని, సృజనాత్మకతమైన ఆలోచనలు చేయాలి కడప ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ మాధవి అన్నారు.శుక్రవారం కడప నగరం నగరపాలక ఉన్నత పపాఠశాల మెయన్‌లో జిల్లా ఇన్‌చార్జి డీఈఓ రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లాస్థాయి లకోజి సంజీవ రాయ శర్మ సైన్స్ ఫెయిర్ కార్యక్రమం నిర్వహించారు. సైన్స్ ఫెయిర్ కార్యక్రమంలో 36మండలాల నుంచి 36 వ్యక్తిగత ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించగా మరో 36 గ్రూపు మరో 36 ఉపాధ్యాయుల ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ విద్యార్థుల ఆలోచన ధోరణి సృజనాత్మక పెంపొందించే విధంగా ఉండాలని సూచించారు. ఇన్‌చార్జి విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి, డీఎస్‌ఓ ఎబినేజర్ మాట్లాడుతూ జిల్లాలోని 36 మండలాల నుంచి వ్యక్తిగత గ్రూపు ఉపాధ్యాయ విభాగాలలో ప్రాజెక్టు ప్రదర్శించారని, ఇందులో చక్కటి ప్రాజెక్టులను మొదటి రెండు స్థానాల్లో ఎంపిక చేశామన్నారు. వారు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అనంతరం సౌత్ ఇండియా లెవెల్‌లో పాండిచ్చేరిలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగమణి, డీసీఈబీ సెక్రటరీ భాస్కర్‌రెడ్డి, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్, సమగ్ర శిక్ష సెక్టోరియల్ ఆఫీసర్ కేశవరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, దశరథరామ్‌రెడ్డి, గంగాధర్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, ఇన్‌చార్జి డీఈఓ రాజగోపాల్‌రెడ్డి

ఉరి వేసుకుని ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న నారాయణ

కురబలకోట, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం రాత్రి కురబలకోట మండలంలో జరిగింది. వివరాలిలా.. మండలంలోని చేనేతనగర్‌కు చెందిన ఎల్.నారాయణ(50) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటికి వచ్చి గమనించిన భార్య లక్ష్మీదేవి కేకలు వేయడంతో స్థానికులు వచ్చి అతడిని కిందకు దించారు. అప్పటికే మృతి చెందాడు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. కాగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు ముదివేడు పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని విచారించారు. ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మిద్దెపై నుంచి పడి భవన నిర్మాణ కార్మికుడి మృతి



వెంకటరమణ మృతదేహం

నిమ్మనపల్లి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మిద్దెపై నుంచి కింద పడి భవన నిర్మాణ కార్మికుడు మృతిచెందిన సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. మృతుని భార్య గంగాదేవి వివరాల మేరకు మండలంలోని బండ్లపై గ్రామంలో మూడేళ్లగా జీవనం కొనసాగిస్తున్నామని తన భర్త వెంకటరమణ(40) మేస్త్రీ పనులకు వెళ్తూ ఉండేవాడని అన్నారు. గురువారం సాయంత్రం పనులు ముగించుకుని వచ్చే క్రమంలో మిద్దెపై నుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడని అన్నారు. స్థానికులు మృతదేహాన్ని మదనపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని స్థానిక పోలీసులు తెలిపారు.

కణితి మాంసం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

కురబలకోట, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కణితి మాంసం విక్రయించేందుకు తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సెక్షన్ ఆఫీసర్ శివకుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని తెట్టు పంచాయతీ మండ్యంవారిపల్లెకు చెందిన శివ(42) స్థానిక అటవీ ప్రాంతం నుంచి కణితి మాంసాన్ని తీసుకువస్తుండగా గుర్తించామన్నారు. అతడి నుంచి మాంసాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

శేషాచలం అడవిలో బీటెక్ విద్యార్థులు అదృశ్యం

- ఆచూకీ కోసం అటవీశాఖ అధికారులతో కలసి పోలీసుల ముమ్మర గాలింపు
- మిత్రులకు లైవ్ లొకేషన్ షేర్ చేసిన విద్యార్థి

రైల్వేకోడూరు(రూరల్), జనవరి 3(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు మండలంలోని శేషాచలం అడవుల్లోని బీటెక్ విద్యార్థులు అదృశ్యమయ్యారని సమాచారం. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన ఆరుగురు బీటెక్ విద్యార్థులు అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండల పరిధిలోని శేషాచల అడవిలో ఉన్న వాగేటికోన ప్రాంతంలోని వాటర్ ఫాల్స్‌ను మరియు గుంజన వాటర్ ఫాల్స్ చూడడానికి శుక్రవారం విహారయాత్రకు వచ్చారు. వీరంతా తిరుగు ప్రయాణంలో దారి తప్పినట్లు తెలిసింది. రాత్రి కావడంతో తిరుగు ప్రయాణంలో దారి తప్పినట్లు గమనించి ఫోన్ సిగ్నల్స్ రావడంతో వారి మిత్రులకు సమాచారం అందించారు. మిత్రుల సలహా మేరకు లైవ్ సిగ్నల్స్ లోకేషన్ పంపించారు.

వారందరూ అడవిలో తిరుగుతూ చివరకు రైల్వేకోడూరు అటవీ పరిధిలోని ఎస్.ఉప్పరపల్లి, ఎస్.కొత్తపల్లి ప్రాంతాల పరిధిలోకి రాగానే ఫోన్ సిగ్నల్స్ రావడంతో రేణిగుంట పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ఈ మేరకు రేణిగుంట పోలీసులు కోడూరు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ హేమసుందర్ రావు ఆదేశాల మేరకు కోడూరు ఎస్ఐ నవీన్ బాబు తమ సిబ్బందితో అటవీశాఖ అధికారులతో కలిసి అడవిలో జల్లెడ పడుతున్నారు. సెల్ ఫోన్ సిగ్నల్స్ అందుబాటులోకి వస్తే వారి ఆచూకీ త్వరగా లభిస్తుంది. తప్పిపోయిన విద్యార్థుల వివరాల కోసం పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది.



శేషాచలం అడవి నుంచి లైవ్ లొకేషన్ పంపిన విద్యార్థి

వామ్మో... స్మార్ట్ మీటర్

- ఆర్‌ఓ ప్లాంటుకు ఒకేసారి పదిరెట్లు విద్యుత్ బిల్లు
- లబోదిబోమంటున్న బాధితులు
- కెపాసిటర్ సమస్య ఉండవచ్చంటున్న అధికారులు

ఎర్రగుంట్ల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వామ్మో... స్మార్ట్ మీటర్. ఇటీవల స్మార్ట్ మీటర్ అంటేనే విద్యుత్ వినియోగదారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఎప్పుడు ఎలాంటి బాంబు పేలుస్తారనే భయంతో వణుకుతున్నారు. సాధారణ మీటర్ల నుంచి డిజిటల్ మీటర్లు, ఆపై స్మార్ట్ మీటర్ అంటూ విద్యుత్ సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వాలు వినియోగదారులపై నడ్డివిరిచే చార్జీలు వేస్తూనే ఉన్నారు. కాల్చిన యూనిట్ ధరకు తోడు ట్రూ అప్ చార్జెస్, ఏసీడీ చార్జెస్, ఇందనపు చార్జీలు, ఫిక్స్‌డ్ చార్జీలు, సర్‌చార్జీలు, ఈడీపై వడ్డీ, కస్టమర్ చార్జీలు అంటూ ఒకటేంటి ఇలా అనేక రకాల చార్జీల మోత మోయిస్తున్నారు. దీం తో వినియోగదారుడు విద్యుత్ సంస్థలు ఎప్పుడు ఏ వడ్డీ వేసి నడ్డి విరుస్తారోనన్న భయం గుప్పి ట్లో వణుకుతున్నారు. త్వరలో స్మార్ట్ మీటర్లకు ప్రీపెయిడ్ రీచార్జి సిస్టం వస్తుందన్న హాట్ టాపిక్‌తో మరింత భయపడుతున్నారు. ఇటీవల కమర్షియల్ కనెక్షన్ల మీటర్లకు స్మార్ట్ మీటర్లు అమర్చారు. అయితే వీటి వినియోగం కొన్ని చోట్ల సమస్యలు రాకపోయినా మరికొన్ని చోట్ల అధిక బిల్లులు వస్తున్నాయని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. కొందరు ఫిర్యాదులు చేస్తుండగా మరికొందరు సర్దుకుపోతున్నారు.

ఆర్‌ఓ ప్లాంటుకు 10రెట్ల బిల్లు...

ముద్దనూరు రోడ్డులో కోకోకోలా గౌస్ 15ఏళ్లుగా వాటర్ ప్లాంట్‌ను నడుపుతున్నారు. పెన్నా నుంచి ట్యాంకర్లతో నీటిని తెప్పించి సరఫరా చేస్తుంటాడు. అయితే ఆర్‌ఓ ప్లాంటుకు 4814 నెంబరుతో సర్వీసు స్మార్ట్ మీటర్‌ను ఇటీవల అమర్చారు. వేసవిలో సరాసరి బిల్లు రూ.3 నుంచి రూ.4వేలు వస్తోంది. మిగతా సమయాల్లో రూ1500 నుంచి రూ.2000 వస్తోందని యజమాని గౌస్ అంటున్నారు. స్మార్ట్ మీటర్ బిగించిన వారం తరువాత విద్యుత్ సిబ్బంది బిల్లు తీస్తే రూ.10,659 వచ్చింది. ఇదేమని విద్యుత్ సిబ్బందిని అడిగితే కెపాసిటర్ మార్చుకో వాలని సలహా ఇచ్చారు. వెంటనే ఆయన కెపాసిటర్‌ను మార్చారు. ఈ బిల్లు కట్టే లోపు డిసెంబరు 2 నుంచి జనవరి 2వరకు బిల్లు తీశారు. ఇప్పుడు ఏకంగా రూ.30909 రా వడంతో వినియోగ దారుడు ఆందోళన చెందు తున్నాడు. నవంబరు, డిసెంబరు బిల్లులు కలిపి మొత్తం రూ.41568 వచ్చింది. దీన్ని కట్టాల్సిందేనని విద్యుత్ అధికారులు పేర్కొన్నారు.



పాత మీటరు బిల్లు - స్మార్ట్ మీటర్ బిల్లులు



కొత్తగా అమర్చిన స్మార్ట్ మీటర్

15ఏళ్లలో ఎప్పుడూ రాలేదు

15ఏళ్లుగా వాటర్ ప్లాంట్‌ను నడుపుతున్నా. పెన్నా నుంచి ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసుకుని కూలింగ్ వాటర్ విక్రయిస్తున్నా. వేసవిలో ఏసీలు వేసినా 3 నుంచి 4వేలు మాత్రమే వచ్చేది. కానీ స్మార్ట్ మీటర్ ఏర్పాటు నుంచి భారీగా బిల్లు వస్తోంది. అధికారుల సలహా మేరకు వారు చెప్పిన కెపాసిటర్‌నే అమర్చాను. అయినా మళ్లీ డిసెంబరు బిల్లు ఏకంగా 31,000రావడం ఆశ్చర్యంగా వుంది. ఇంత బిల్లు కట్టే పరిస్థితి నాకులేదు. అసలే వ్యాపారాలు లేక ప్లాంటు జరగక తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నాము. గత రీడిగింగులను పరిగణలోకి తీసుకుని ఎలాగైనా బిల్లు మొత్తాన్ని తగ్గించాలని అధికారులను కోరారు.

కోకోకోలా గౌస్

పర్యవేక్షణలో ఉంచి చర్య తీసుకుంటాం

ఇలాంటివి కెపాసిటర్ సమస్యలతో వస్తాయి. దీన్ని వినియోగదారుడే చూసుకుని సరిచేసుకోవాలి. మాకు సంబందం లేదు. అయినా కెపాసిటర్, మోటార్ పనితీరును అదే సమయంలో మీటర్ రీడింగ్‌ను గంటగంటకూ పరీక్షించి చేస్తాం. డిపార్ట్‌మెంట్ పరంగా ఎక్కడైనా సమస్య వుంటే తప్పకుండా సరిచేసి, న్యాయం చేస్తాం.

ప్రియదర్శన్‌రెడ్డి, ఏఈ డిస్కం

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ఆరు కిలోల గంజాయి స్వాధీనం

కడప క్రైం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రిమ్స్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు రిమ్స్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. సీఐ వివరాల మేరకు కడప రామక్రిష్ణా నగర్ వాసి కాకి శివ అలియాస్ శివమణి శుక్రవారం పాలకొండలు సమీపంలో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ఎస్ఐ జయరాములు సిబ్బందితో కలిసి గంజాయి విక్రయిస్తున్న శివను అరెస్టు చేసి ఆరు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఏడుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

రూ.38,450 నగదు స్వాధీనం

పులివెందుల టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పేకాడుతు న్న ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.38450 నగ దు స్వాధీనం చేసుకున్నామని పట్టణ ఎస్ఐ నారాయణ తెలిపారు. శుక్రవారం పట్టణ పరిధిలో సిబ్బందితో కలిసి తనిఖీ చేస్తుండగా పెద్దజూటూరు వద్ద జూదమాడుతున్న వారిని గమనించి వారిని అరెస్టు చేసి వారి వద్ద నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

పెండింగ్ పనులు పూర్తిచేస్తాం

జగన్ అనాలోచిత నిర్ణయంతోనే రోడ్ల దుస్థితి ● వేంపల్లెలో పనులను పునఃప్రారంభించిన బీటెక్ రవి



వేంపల్లెలో నిలిచిపోయిన రోడ్లు, డ్రైనేజీ పనులను పునః ప్రారంభిస్తున్న బీటెక్ రవి, ఈఈ మాధవి తదితరులు

వేంపల్లె, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జగన్ అనాలోచిత నిర్ణయంతోనే రోడ్ల పనులు నిలిచిపోయాయని, కూటమి ప్రభుత్వంలో పెండింగ్ పనులు పూర్తి చేస్తామని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) అన్నారు. వేంపల్లెలో వైసీపీ ప్రభుత్వం హడావుడిగా ప్రారంభించి నిలిపేసిన రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను సీఎం చంద్రబాబు హామీతో పునఃప్రారంభించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేంపల్లె, పులివెందుల, బాకరాపురం ప్రాంతాల్లో రోడ్ల దుస్థితి అధ్వాన్నంగా ఉందన్నారు. వైఎస్ జగన్ అనాలోచిత నిర్ణయం, వైసీపీ నేతల అతి విశ్వాసం, 30ఏళ్లు అధికారంలో ఉంటామన్న అహంకారంతో ఈ రోడ్ల పనులు నిలిచిపోవడానికి కారణమయ్యాయన్నారు. వేంపల్లెలో రోడ్ల పరిస్థితులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, కాంట్రాక్టర్‌కు భరోసా ఇచ్చి పనులు పూర్తిచేసేందుకు ముందుకొచ్చామన్నారు. త్వరలోనే వేంపల్లె బస్టాండ్, అలిరెడ్డిపల్లె హైలెవెల్ బ్రిడ్జిని మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి ద్వారా ప్రారంభిస్తామన్నారు. ఆర్‌అండ్‌బీ ఈఈ మాధవి, డీఈ వేణుగోపాల్, ఏఈ మనోహర్‌రెడ్డి, టీడీపీ మండల పరిశీలకులు రఘునాథరెడ్డి, మండల కన్వీనర్ ము నిరెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి జయరామిరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, టీడీపీ యువ నేత నామా వేమకుమార్, మైనార్టీ కన్వీనర్ వలి, శేషారెడ్డి పాల్గొన్నారు.

అప్పుల బాధతో అన్నదాత ఆత్మహత్య




మహేశ్వర్ రెడ్డి మృతదేహం - ఫైల్ ఫొటో

పెద్దముడియం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో రైతు మహేశ్వర్‌రెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య స్వర్ణలత ఫిర్యాదుపై నమోదైన పోలీసు కేసు వివరాల్లోకెళితే.... కొండసుంకేసుల వాసి మహేశ్వర్‌రెడ్డి కుటుంబం వ్యవసాయం చేస్తూ జీవనం సాగించే వారు. వారికి ఉన్న 8 ఎకరాలకు తోడు మరో ఆరెకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తూ వస్తున్నారు. పంటల దిగుబడి సరిగా రాక అప్పులు పెరుగుతూ వస్తున్నాయి. ఇటీవల వచ్చిన తుపానుల ప్రభావంతో పంటలు దెబ్బతిన్నాయి. అంతేకాకుండా ప్రస్తుత తుపాను మరింత దెబ్బతీసింది. గురువారం రాత్రి భార్యతో అప్పులపై మాట్లాడాడు. భార్య సర్దిచెప్పి పిల్లలతో కలిసి ఓ గదిలో నిద్రపోగా మరో గదిలో నిద్రపో యిన మహేశ్వర్‌రెడ్డి తెల్లారే సరికి ఫాన్ కొక్కీకి శవమై వేలాడుతూ కన్పించాడు. భార్య స్వర్ణలత ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని ఆస్ప త్రికి తరలించారు.

మద్యానికి బానిసై తండ్రిని చంపిన తనయుడు

ప్రొద్దుటూరు జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన కుమారుడు మద్యం తాగటానికి డబ్బులు ఇవ్వలేదని గురువారం రాత్రి కన్నతండ్రిని హత్య చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే... ప్రొద్దుటూరు పట్టణం మోడంపల్లెలో వెంకటస్వామి (65) అనే వృద్ధుడిని ఆయన కుమారుడైన వెంకటసుబ్బయ్య మద్యం తాగటానికి డబ్బులు ఇవ్వలేదని కర్రతో తలపై మోదాడు. దీంతో తీవ్రంగా గాయాలయ్యాయి. వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో వెంకటస్వామి మరణించాడు. ఈ ఘటన గురువారం అర్ధరాత్రి చోటుచేసుకోగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. మృతుడు వెంకస్వామిభార్య లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

వీరారెడ్డి మృతదేహానికి నేడు శవపరీక్ష

మైదుకూరు రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు మున్సిపాలిటీలోని శెట్టివారిపల్లె గ్రామానికి చెందిన అల్లాడుపల్లె వీరారెడ్డి (75) డిసెంబరు 6వ తేదీ మృతి చెందాడు. తన తండ్రి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ మైదుకూరు పోలీసు స్టేషన్‌లో వీరారెడ్డి కుమారుడు రమేష్ ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటన మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ దృష్టికి వెళ్లింది. వెంటనే ఆయన స్పందించి వీరారెడ్డి మృతిపై వెంటనే విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దీనిపై ఉన్నతాధికారులు చొరవ తీసుకొని శనివారం రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్, పోలీస్ ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో వీరారెడ్డి మృతదేహానికి శవపరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

7న కేంద్ర కరువు బృందం పర్యటన

బి.కొత్తకోట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో సాగైన పంటలకు జరిగిన నష్టాన్ని పరిశీలించేందుకు కేంద్ర కరువు బృందం ఈ నెల 7వతేదీ జిల్లాకు రానుంది. పెరీన్‌దేవి, పాలసీ అండ్ కోఆర్డినేషన్ జాయింట్ సెక్రటరీనేతృత్వంలో సుప్రియామాలిక్, అనూరాధాబటానా, అశిష్ పాండేలతో కూడిన కరువుబృందం బి.కొత్తకోట పరిధిలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌కు చేరుకుంటారు. రాత్రికి హిల్స్‌లో బస చేస్తారు. 8న ఉదయం 9గంటల నుంచి నిర్దేశించిన గ్రామాలలో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించి, బాధిత రైతులతో ముఖాముఖి మాట్లాడతారు. అనంతరం వ్యవసాయశాఖ, రెవెన్యూ అధికారులతో సమీక్షిస్తారు.

పరిసరాల శుభ్రతతోనే వ్యాధుల కట్టడి

కడప కలెక్టరేట్, జనవరి3 (ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రతతోనే సీజనల్ వ్యాధులను కట్టడి చేయవచ్చని జిల్లా మలేరియా అధికారి మనోరమ చెప్పారు. సీజనల్ వ్యాధులకు ప్రధాన కారణమైన దోమలను నియంత్రిచడంలో భాగంగా ప్రతి ఒక్కరూ 'ఫ్రైడే డ్రైడే' పాటించాలన్నారు. నగరంలోని అబ్దుల్ నబీ వీధిలో దోమల నివారణ, మలేరియా, డెంగ్యూ, గున్యా వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. అప్పర్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేశారు.

మహిళలకు విద్య ద్వారానే సమాజ పురోగతి: ఎమ్మెల్యే




సావిత్రిబాయి పూలే కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్.మాధవి... బహుమతులు అందిస్తున్న మాసా కోదండరామ్

కడప మారుతీనగర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మహిళలకు విద్య ద్వారానే సమాజ పురోగతి సాధ్యమని ఎమ్మెల్యే మాధవి అన్నారు. భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయిని, అణగారిన వర్గాల ఆశాజ్యోతి సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ అధ్యక్షుడు బత్తల లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు, ప్రధాన కార్యదర్శి త్రివిక్రమ్ ఆధ్వర్యంలో శుక్రవారం బీసీ భవన్‌లో జయంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాధవి హాజరై మాట్లాడారు. విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యమని విశ్వసించిన మహనీయురాలు సావిత్రిబాయి అన్నారు. బాల్యవివాహాలు, మూఢనమ్మకాలు, సతీసహగమనానికి వ్యతిరేకంగా ఉద్యమించారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి భరత్‌రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, సంఘం నాయకులు రామాంజనేయులు, పి.పి. సరళాదేవి, మహిళానాయకురాలు జయశ్రీ, నాయకులు పి.రాజా, మల్లయ్య, విశ్రాంత ఉపాధ్యాయులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమాజ సేవకురాలు సావిత్రిబాయి: మాసా కోదండరామ్

సమాజ సేవకురాలు సావిత్రిబాయి పూలే అని బీసీ సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మాసా కోదండరామ్ కొనియాడారు. సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా బీసీ సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ఎర్రముక్కపల్లెలోని పాఠశాలలో జయంతి వేడుకలు నిర్వహించారు. ఆమె జీవితంపై వి ద్యార్థులకు వ్యాసరచన పో టీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నరసింహులు, ఉపాధ్యాయులు, రాంప్రసాద్, మహబూబ్‌బాషా, ధనలక్ష్మి, రాజ్యలక్ష్మి, శాంతి, మౌనిక, భారతి, సువర్ణ, శివ, మనీషా తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చదువు సావిత్రిబాయి పూలే పుణ్యమే: అవ్వారు

చదువుల తల్లి సావిత్రిబాయి పూలే అని జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున అన్నారు. ప్రకాషనగర్ కాలనీలో జయంతి వేడుకలు నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ని వాళులర్పించారు. అంటరానితనం నిర్మూలనే ధ్యేయంగా నాటి అగ్రవర్ణ వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమించిన గొప్ప ధైర్యశాలి సావిత్రిబాయి పూలే అన్నారు. నాయకులు పి.వి. రమణ, నూకల పెంచలయ్య, షిండే భాస్కర్, గున్న జయరామ్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న అవ్వారు మల్లికార్జున తదితరులు

సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే

కడప నాగరాజుపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే అని ఆల్‌షిఫా మానసిక దివ్యాంగుల పునరావస కేంద్ర వ్యవస్థాపకుడు మహమ్మద్ రఫీ అన్నారు. శుక్రవారం సావిత్రి బాయి పూలే జయంతిని నిర్వహించారు.

బలహీన వర్గాల స్త్రీలకు స్ఫూర్తిప్రదాత సావిత్రిబాయి పూలే

కమలాపురం రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : బలహీన వర్గాల స్త్రీలకు స్ఫూర్తి ప్రదాత సావిత్రి బాయి పూలే అని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ లక్షుమయ్య తెలిపారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం పూలే జయంతి నిర్వహించారు.

మహిళా సాధికారత కోసం పాటుపడిన సావిత్రిబాయి పూలే

కడప సెవెన్ రోడ్స్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత కోసం పాటుపడిన మహిళా శక్తి సావిత్రిబాయి పూలే అని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర అన్నారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కె.శివశంకర్, జిల్లా సహాయ కార్యదర్శులు చంద్ర, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

వైవీయూలో సావిత్రి బాయి పూలే జయంతి

కడప ఎడ్యుకేషన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తరతరాలు గుర్తుంచుకునే ఆదర్శనీయురాలు, సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే అని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమం వైవీయూ బీసీ సెల్ ఆధ్వర్యంలో సైన్స్ బ్లాక్‌లోని సెమినార్ హాల్లో నిర్వహించారు. బీసీ సెల్ ప్రతినిధి డాక్టర్ సుభోస్ చంద్ర, డాక్టర్ పార్వతి, బీసీ సెల్ అధ్యక్షులు ఆచార్య కేఎస్‌వీ కృష్ణారావు, ఓబీసీ సెల్ సభ్యులు డాక్టర్ గంగయ్య, సరళ, అధ్యాపకులు, విద్యార్థులు, స్కాలర్లు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ వైఎస్సార్ ఏఎఫ్ఏయూ...

డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో వీసీ ఆచార్య జి.విశ్వనాథకుమార్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. వీసీ, ప్రొఫెసర్ జి.విశ్వనాథకుమార్, రిజిస్ట్రార్ ఎస్.రాజేష్‌కుమార్‌రెడ్డి పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

సీమ ఔన్నత్యాన్ని చాటిన మహిళలు

● మూల మల్లికార్జునరెడ్డి

కడప కల్చరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ భాష, చరిత్ర, సంస్కృతి, సాహిత్యం, కళలు, తదితర అంశాలపై నిర్వహించిన కవితా పోటీలలో మహిళలు సీమ ఔన్నత్యాన్ని చాటిచెప్పారని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. ఫిబ్రవరి 8, 9, తేదీలలో చేపట్టే జిల్లా రచయితల మహాసభల్లో ఏర్పాటు చేయనున్న శతాధిక కవి సమ్మేళనంలో భాగంగా కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఆ కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ వి. సలీం బాషా ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థినులకు కవితా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

భావన టౌన్‌షిప్ అక్రమాలపై నారా లోకేశ్‌కు వినతి

కడప సెవెన్ రోడ్స్, జనవరి 3 (ఆంధ్రజోయతి): బావన టౌన్‌షిప్ అక్రమాలపై రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి శుక్రవారం మంగళగిరిలో ఐటి, విద్యాశాఖ మంత్రి నారాలోకేష్‌ను కలిసి వినతిపత్రంతో పాటు 400పేజీల పుస్తకాన్ని అందించారు. ఈ సందర్భంగా రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ 2023లో యువగళం పేరుతో నిర్వహించిన పాదయాత్రలో మంత్రి నారా లోకేశ్ భావన టైన్‌షిప్ అక్రమాలపై విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు. చింతకమ్మదిన్నె పరిధి ఉటుకూరు మూలవంక నందు భావన టౌన్‌షిప్ పేరుతో 692/1ఏ, 1బి, 718/2, 719/1, 720/1,2 సర్వే నెంబర్లలోని ప్రభుత్వ భూమిని బుద్దా ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ వారు దొంగ రికార్డులు సృష్టించారని, బుకరియా ఎడ్యుకేషన్ సొసైటీ వారికి భూమి ఎలా వచ్చిందో, ఎవరిచ్చారో ఎప్పుడు కొన్నారో తెలపాలని కోరారు.

సంపద సృష్టి కేంద్రాలను ఉపయోగంలోకి తీసుకురావాలి

వీరపునాయునిపల్లె, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సంపద సృష్టికేంద్రాలను ఉపయోగంలోకి తీసుకురావాలని డీపీఓ రాజ్యలక్ష్మి, డీఎల్‌పీఓ రమాదేవిలు శుక్రవారం అన్నారు. మండల పరిధిలోని ఎస్.పాలగిరి, వీరపునాయునిపల్లె, మొయిళ్లచెరువు గ్రామాల్లోని గ్రామ సచివాలయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మొయిళ్ల చెరువు గ్రామంలో చేస్తున్న సర్వే ఎంత వరకు వచ్చింది దానిపై పరిశీలించారు. తంగేడుపల్లె గ్రామంలో ఉన్న సంపద సృష్టికేంద్రాన్ని పరిశీలించారు. త్వరలో సంపద సృష్టి కేంద్రాలను ఉపయోగింలోకి తీసుకురావాలని, ఇంటింటా చెత్త సేకరణ పనులు, లైసెన్సు పనులు పనులు వందశాతం అమలు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవు : తహసీల్దారు

కడప కలెక్టరేట్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు, వంకలు, వాగుల ఆక్రమణలకు పాల్పడే చర్యలు తప్పవని కడప తహసీల్దారు నారాయణ రెడ్డి హెచ్చరించారు. కడప నగర పరిధిలోని ఆర్ట్స్ కళాశాల ఎదురుగా చిన్నచౌక్ సర్వే నెంబరు 955లో ప్రభుత్వ భూమి ఆక్రమణ జరిగిందని తమకు ఫిర్యాదులు అందాయన్నారు. దీంతో శుక్రవారం తాను సిబ్బందితో కలిసి ఆ స్థలాన్ని పరిశీలించానన్నారు. అక్కడ కట్టడాలు చేపడితే చర్యలు తప్పవన్నారు.

తీగలను తొలగించండి సారూ...

సికెదిన్నె, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తీగలు కరెంటు స్తంభాలకు అల్లుకుంటున్నాయి. అయినప్పటికి విద్యుత్తు అధికారులు స్పందించకపోవడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. రైతులు సాగుచేసే వ్యవసాయ పొలాల వద్ద తీగలు అల్లుకుంటుండటంతో వర్షం వచ్చే సమయంలో కరెంటు షాక్ తగిలి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. కావున అధికారులు స్పందించి తీగలను తొలగించకపోతే ప్రజలు, మూగజీవాలు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉ న్నాయి. ఇప్పటికైనా విద్యుత్తు శాఖ అధికారులు తమ నిర్లక్ష్యాన్ని వీడి తీగలు తొలగించాలని, వర్షాలు పడి ప్రమాదాలకు గురికాక ముందే జాగ్రత్తలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.




బుగ్గలేటిపల్లె వద్ద విద్యుత్ స్తంభానికి అల్లుకున్న తీగలు



పెద్దకాంపల్లె వద్ద విద్యుత్ స్తంభానికి అల్లుకున్న తీగలు.. సీకేదిన్నె వద్ద..

నేడు మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం

పెండ్లిమర్రి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో శుక్రవారం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు గంగిరెడ్డి తెలిపారు. కావున మండలంలోని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు చెన్నూరు మండల మీట్

చెన్నూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ చీర్లసురేశ్ యాదవ్ ఆధ్వర్యంలో సభాభవనంలో జరుగుతుందని ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు జయనగర్ కాలనీలో రెవెన్యూ సదస్సు

కడప కలెక్టరేట్, జనవరి3 (ఆంధ్రజ్యోతి): కడప మండలం చిన్నచౌకు గ్రామ జయనగర్‌కాలనీలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దారు నారాయణ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సదస్సును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సదస్సుకు పూర్తి స్థాయిలో రెవెన్యూ సిబ్బంది రికార్డులతో హాజరవుతారని, భూ సమస్యలు ఉన్న రైతులు పాల్గొని తమ పరిష్కరించుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

ట్రాక్టర్ చోరీ.. కేసు నమోదు

సింహాద్రిపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సింహాద్రిపురం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ట్రాక్టర్ దొంగతనం కేసు నమోదైనట్లు ఎస్ఐ తులసీ నాగప్రసాద్ తెలిపారు. ఎస్ఐ సమాచారం మేరకు... అంకాళమ్మగూడూరు గ్రామానికి చెందిన కటికిరెడ్డి శ్రీనివాసరెడ్డి తన తోటలోని ప్యాక్ హౌస్ వద్ద ట్రాక్టరు ఇంజను, రెండు ట్రాలీలు ఉంచాడు. గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేసి తీసుకెళ్లారు. చోరీకి గురైన వాటి విలువ సుమారు రూ. 4 లక్షలా యాభై వేలు ఉంటుందని ఎస్ఐ తెలిపాడు. బాధితుడు కటికిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం : బీటెక్ రవి

సింహాద్రిపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్ మారెడ్డి రవీంద్రనాథరెడ్డి(బీటెక్ రవి) అన్నారు. శుక్రవారం సింహాద్రిపురంలో రూ.10 లక్షలతో ముస్లిం శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సింహాద్రిపురం మండలంలో వైసీపీ ప్రభుత్వంలో నిలిచిపోయిన నిర్మాణ పనులన్నీ పూర్తి చేస్తామన్నారు. పట్టణంలోని ప్రధాన వీధిలో నిలిచిపోయిన సీసీ రోడ్డు, జడ్పీ ఉన్నత పాఠశాల భవన నిర్మాణ పనులు ప్రారంభించామన్నారు. కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌ల సారథ్యంలో సమగ్ర అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. కార్యక్రమంలో తుంగభద్ర ప్రాజెక్ట్ హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, వేంపల్లె టీడీపీ మండల పరిశీలకుడు రఘునాథరెడ్డి, మాజీ జడ్పీటీసీ పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పుప్పాల శ్రీధర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మైనార్టీనాయకులు రఫీ, నబీరసూల్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మారెడ్డి రవీంద్రనాథరెడ్డి

పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

కడప(వినాయకనగర్), జనవరి3(ఆంధ్రజ్యోతి): సత్యసాయి జిల్లా ధర్మవరంలో ఫిబ్రవరి 10, 11 తేదీల్లో జరిగే ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర 3వ మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన కరపత్రం విడుదల చేశారు. అనంతరం తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ మెస్ చార్జీలను వెంటనే విడుదల చేయాలన్నారు. మహాసభలకు జాతీయ కార్యదర్శులు హఫీవుల్లా, రాష్ట్ర కార్యదర్శి జానకీరామ్ హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపీ, నరసింహప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'హిందువులంతా విజయవాడ సభకు తరలిరావాలి'

వేంపల్లె, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నియంత్రణలో ఉన్న హిందూ దేవాలయాలను స్వయం ప్రతిపత్తి కలిగేలా ఒక ఉత్తమ ధార్మిక సంస్థకు అప్పగించాలనే జాతీయ ఉద్యమంలో హిందువులంతా తరలి రావాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు పిలుపునిచ్చారు. హైందవ శంఖారావం కార్యక్రమం ఈనెల 5వ తేదీన విజయవాడలో జరగనుంది. ఆ కార్యక్రమాన్ని హిందువులంతా తరలి వచ్చి విజయవంతం చేయాలని వేంపల్లెలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక అమ్మవారిశాల నుంచి ఆంజనేయస్వామి ఆలయం మీదుగా బస్టాండ్, కడప రోడ్డు, నాలుగురోడ్ల కూడలి వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. చిన్నారుల నృత్య ప్రదర్శనతో ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా వీహెచ్‌పీ నేతలు మాట్లాడుతూ హిందువుల మనోభావాలను గుర్తించి ఈ ఆలయాలను ప్రభుత్వ నియంత్రణ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. దీని కోసం హిందువులంతా ఎప్పటికప్పుడు ఐక్యంగా ముందుకు సాగాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

ఈ విద్యా సంవత్సరం నుంచే వర్గీకరణ అమలయ్యేలా చూడాలి

-ర్యాలీలో దండు వీరయ్య మాదిగ

కడప మారుతీనగర్, జనవరి 3, (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ 2025 విద్యా సంవత్సరం నుంచే అమలయ్యేలా చూడాలని మాదిగ, దాసరి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శుక్రవారం వినతులు స్వీకరించేందుకు విచ్చేసిన రాజీవ్‌రంజన్ మిశ్రా కమిషన్‌ను ర్యాలీగా వెళ్లి కలిశారు. అనంతరం వినతిపత్రం అందజేశారు.



ర్యాలీలో పాల్గొన్న దండు వీరయ్య, నాగభూషణం

ఎస్సీలలోని హిందువులకు మేలు చేయండి: జయరామ్

దళిత క్రిస్టియన్‌లను బి.సి(సి)గా పరిగణించి ఎస్సీలలోని మాల, మాదిగ కులాల్లో గల హిందువులకు మేలు జరిగేలా చూడాలని ఏపీ షెడ్యూల్డ్ క్యాస్ట్ హిందూ మహాసభ అధ్యక్షుడు గున్నా జయరామ్ ఏకసభ్య కమిషన్‌ను కోరారు. ఎస్సీ కుల సంఘాలలో నాయకులు గా చెలామణి అవుతున్న వారిలో అత్యధికం గా క్రిస్టియన్ వర్గానికి చెందినవారే ఉన్నారన్నారు.

మా విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయండి: బేడ బుడగజంగం

మా కులం ఏదో అనే విషయాన్ని పాలక ప్రభుత్వాలు గుర్తించక పోవడంతో మా కుల విద్యార్థులు విద్యకు దూరంగా ఉన్నారని, వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని బేడ బుడగ జంగం సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు టి. కొండయ్య, టి. నారాయణ, జిల్లా అధ్యక్షుడు దూపం రాజు, డి. శ్రీరాములు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చిన్నగంగులు, మధారు, పెద్దన్న, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన పెన్షనర్ల సంఘం నేతలు

కడప కలెక్టరేట్, జనవరి3 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి రామ్మూర్తి నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డిని కలిశారు. సమావేశాలు నిర్వహించుకోవడానికి తమ కార్యాలయం వెనుక భాగంలో ఉన్న 2.5 సెంట్ల స్థలాన్ని ఇప్పించాలని కోరారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు రాధాకృష్ణ, కోశాధికారి నూనె నాగేష్ తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నాగమునిరెడ్డి, తుపాకుల నారాయణ, శ్రీనివాసులు, శంకరయ్య ఉన్నారు.

నామినేటెడ్ పదవుల్లో జిల్లా నేతలకు అవకాశం కల్పించండి

● సీఎంకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి వినతి

కడప ఎర్రముక్కపల్లె, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవుల్లో జిల్లా నాయకులకు అవకాశం కల్పించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.గోవర్ధన్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబుకు విన్నవించారు. కడపలో జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి రెండు ఎకరాల స్థలం కేటాయించినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే జిల్లాలో పార్టీ విజయానికి అంకితభావంతో కృషిచేసిన టీడీపీ నేతలు, కార్యకర్తలకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని కోరారు. ముఖ్యమంత్రి స్పందిస్తూ జిల్లా రాజకీయ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారని గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పార్టీకి కష్టపడ్డ ప్రతి కార్యకర్తకూ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు.



ముఖ్యమంత్రితో మాట్లాడుతున్న గోవర్ధన్‌రెడ్డి

వేంపల్లె ఐఈఆర్టీకి సావిత్రి బాయి పూలే అవార్డు

వేంపల్లె, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె భవిత కేంద్రంలో పనిచేస్తున్న ఐఈఆర్టీ యశోదకు సావిత్రిబాయి పూలే అవార్డు లభించింది. భవిత కేంద్రంలో దివ్యాంగ పిల్లలకు యశోద చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డును భారత చైతన్య యువజన పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం యశోదకు అందించారు. హాజరైన ముఖ్య అతిథుల చేతులమీదుగా ఈ అవార్డును అందుకోవడం సంతోషంగా ఉందని ఐఈఆర్టీ యశోద తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ అమలు తగదు

● ఇమ్మానియేలు, వినోద్‌కుమార్

కడప మారుతీనగర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అన్నదమ్ముల్లా కలిసిమెలసి ఉన్న ఎస్సీల్లోని మాల, మాదిగలను వర్గీకరణ పేరుతో వేరు చేయడం తగదని రాష్ట్ర మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు రామాజీ ఇమ్మానియేల్, రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లపాక వినోద్‌కుమార్ పేర్కొన్నారు. వర్గీకరణ ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర మాల మహానాడు (రామాజీ వర్గం) ఆధ్వర్యంలో కడప కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితుల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నాలను పాలక ప్రభుత్వాలు మానుకోవాలన్నారు. ఆ సంఘం నాయకులు వెంకటరమణ, సాగర్, ఓబులేసు, కిరణ్, రాయలసీమ మహిళా అధ్యక్షురాలు బండి నీతు, అధ్యక్షులు చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ వద్దు - జై భీమ్ మాల మహాసేన

కడప ఎడ్యుకేషన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ వద్దంటూ జైభీమ్ మాల మహాసేన ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఏకసభ్య కమీషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతిపత్రం సమర్పించారు. మహాసేన అధ్యక్షుడు పల్లెకొండు సంపత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి చైతన్య, దళిత నేతలు రాజమణి, సీహెచ్ వినోద్‌కుమార్, పల్లె శివ, అరుణకుమారి, వసంత్, దివాకర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య కమిటీల సహకారంతోనే పాఠశాలల అభివృద్ధి

సికెదిన్నె, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పాఠశాల యాజమాన్య కమిటీల ద్వారానే పాఠశాలను అభివృద్ధి చెంది బలోపేతం అవుతాయని సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబలైజింగ్ ఆఫీసర్ కేశవరెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ యాజమాన్య కమిటీ చైర్మన్, సభ్యులకు శుక్రవారం ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు.రీసోర్స్ పర్సన్ రాయప్పరాజు, క్రిష్ణప్రసాద్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన చెరకూరి రవికుమార్‌నాయుడు



బద్వేలు రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబును బద్వేలు నియోజకవర్గ టీడీపీనాయకుడు చెరకూరి రవికుమార్‌నాయుడు గురువారం ముఖ్యమంత్రి చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే రాయలసీమలోనే అత్యంత వెనుకబడిన నియోజకవర్గం బద్వేలు అని, బద్వేలు అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరించాలని కోరినట్లు తెలిపారు. నియోజకవర్గ సమస్యలపై కూడా వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. స్పందించిన ముఖ్యమంత్రి నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు.

కేసీకెనాల్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

కలెక్టరును కోరిన ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు , జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : కేసీ కెనాల్ మరమ్మతులతో పాటు అభివృద్ధికి నిధులు కేటాయించాలని జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌ను ఎమ్మెల్యేలు వరదరాజులరెడ్డి, పుత్తా చైతన్యరెడ్డి కోరారు. శుక్రవారం కేసీ కెనాల్ ప్రాజెక్టు వైస్ చైర్మన్ లక్ష్మీపేట గురివిరెడ్డి, కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ చైర్మెన్ ధనిరెడ్డి రామచంద్రారెడ్డి లతో కలిసి వారు కలెక్టరును కలిసి ఆయనను పూల మాలతో సత్కరించారు.

ఏకసభ్య కమిషన్ సభ్యులను కలిసిన ఎమ్మార్పీఎస్ నేతలు

కొండాపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం ప్రభుత్వం నియమించిన రాజీవ్‌రంజన్ మిశ్రా నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ సభ్యులను ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం కడపలో కలిశారు. ఎస్సీ వర్గీకరణ వెంటనే చేపట్టాలని కోరినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, నాగసుబ్బరాయుడు, పెద్దన్న, గంగాధర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విషపురుగులతో భయం..భయం...

జూనియర్ కళాశాల, పాఠశాల చుట్టూ గండికోట బ్యాక్‌వాటర్ ● ఆందోళనలో విద్యార్థులు



జూనియర్ కాలేజీ, పాఠశాల చుట్టూ చేరిన గండికోట బ్యాక్‌వాటర్

కొండాపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కొండాపురం గ్రామంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల చుట్టూ గండికోట ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొండాపురం గ్రామం ముంపునకు గురి కావడంతో గండికోట బ్యాక్‌వాటర్ కళాశాల, పాఠశాల చుట్టూ చేరింది. దీంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. గ్రామం ముంపునకు గురై ఖాళీ చేసి దాదాపు నాలుగేళ్లు కావస్తున్నా ఇంకా కొత్తగా కళాశాల , హైస్కూల్ గానీ నిర్మించక పోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

బ్యాక్‌వాటర్‌తో చుట్టూ విషపురుగులు

కాలేజీ, పాఠశాల చుట్టూ గండికోట బ్యాక్‌వాటర్ ఉండటంతో విషపురుగులు వస్తున్నాయని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. పాములు, తేళ్లు పాఠశాల ఆవరణలోకి వస్తుండటంతో విద్యార్థులు భయపడుతున్నారు. అదేవిధంగా ప్రస్తుతం కొత్తగా ఏర్పడిన గ్రామానికి సుమారు 2 కిలోమీటర్ల దూరంలో పాఠశాల, కాలేజీ ఉన్నాయి. కేవలం మట్టిరోడ్డు మాత్రమే ఉంది. దీంతో విద్యార్థులు రావటానికి ఇబ్బంది పడుతున్నారు. ఈ ప్రాంతంలో చుట్టూ ఇళ్లు ఖాళీ చేయడంతో పిల్లలను బడి,కాలేజీకి పంపడానికి తల్లిదండ్రులు వెనుకంజ వేస్తున్నారు. దీంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. ఒకప్పుడు హైస్కూల్‌లో సుమారు 600 మంది విద్యార్థులు దాకా చదివేవారు, ప్రస్తుతం 170 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అదేవిధంగా కళాశాలలో కూడా విద్యార్థుల సంఖ్య తక్కువగానే ఉంది.

ఊరు ఖాళీ చేసి నాలుగేళ్లయినా..: కొండాపురం గ్రామం ముంపునకు గురికావడంతో గ్రామం ఖాళీ చేసి దాదాపు నాలుగేళ్లు కావస్తోంది. అయినా పునరావాసం క్రింద కొత్తగా పాఠశాల,కళాశాలలను నిర్మించక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. నాడు-నేడు క్రింద వందల కోట్లు ఖర్చు చేశామని చెప్పుకుంటున్న వైసీపీ ప్రభుత్వం గత నాలుగేళ్లలో వీటి నిర్మాణానికి కనీసం పునాదిరాళ్లు కూడా వేయకపోవడం గమనార్హం. దీంతో ప్రస్తుతం విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.





హైస్కూల్‌కు ప్రతిపాదనలు పంపాం

కొండాపురం జడ్పీహైస్కూల్‌కు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి చొరవతో ప్రతిపాదనలు పంపాం. సుమారు రూ.13 కోట్లతో పాఠశాల చక్కగా నిర్మించడానికి ఇంజనీర్లు పరిశీలించి వెళ్లారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉంది.

ఓబులేసు,ఎంఈవో,కొండాపురం.

కళాశాల ఆవరణలో నిత్యం పాములు, తేళ్లు..:

చుట్టూ నీళ్లు ఉండటంతో కళాశాల ఆవరణలో నిత్యం పాములు, తేళ్లు దర్శనమిస్తున్నాయి. దీంతో విద్యార్థులు కాలేజీకి రావాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం 31 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ప్రక్కనే ఉన్న హైస్కూల్‌కు ప్రతిపాదనలు పంపినా, కాలేజీ నిర్మాణానికి ఇంత వరకు అడుగులుపడలేదు. ప్రభుత్వం చొరవ తీసుకుని కాలేజీ మరొక చోటుకు మారిస్తే విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది.

రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్, జూనియర్ కాలేజీ, కొండాపురం.

మొక్కు తీర్చుకున్న జనసేన నాయకులు

పోరుమామిళ్ల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ముందు పవన్‌కళ్యాణ్ గెలవాలని కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాలని కోరుతూ వెంకటేశ్వరస్వామిని మొక్కుకున్నామని, ఆ మొక్కు తీర్చేందుకు పాదయాత్ర చేపట్టామని జనసేన నాయకులు శీలంశెట్టి లక్షుమయ్య తెలిపారు. శుక్రవారం జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జనసేన నాయకులు వెంకటేశ్, రమణయ్య, రామక్రిష్ణ, సిద్దు పాల్గొన్నారు.

బోరు ఏర్పాటు

బ్రహ్మంగారిమఠం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం మండలంలోని నాగిశెట్టిపల్లె గ్రామంలో మైదుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రజలకు పుట్టా సుధాకర్‌యాదవ్ కాలనీలో అలాగే పోలేరమ్మ గుడి ప్రాంతంలో తాగునీటి కోసం శుక్రవారం బోరు ఏర్పాటుకు పనులు ప్రారంభించారు. రెండు మూడు రోజుల్లో మోటరును ఏర్పాటు చేసి ప్రజలకు నీటి ఇబ్బందులు లేకుండా చేస్తామని టీడీపీ నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పొడపాటి చంద్రబాబు , పొడపాటి సురేశ్‌నాయుడు, పొడపాటి వెంకటరమణనాయుడు, పొడపాటి బీమా నాయుడు, వేల్పుల భాస్కర్‌యాదవ్, వేల్పుల సుదర్శన్, సర్పంచ్ వాకమల్ల అనంతరెడ్డి, అధికారులు సిద్దార్థ, వినోద్, గ్రామ ప్రజలు ఓబుల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, రామయ్య, క్రిష్ణయ్య, బాల గురయ్య, మల్లికార్జున తదితరులు ఉన్నారు.

వరిధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



చాపాడు సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లక్షుమయ్య

ఖాజీపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, భూమాయపల్లె సర్పంచ్ వెంకటసుబ్బయ్య అన్నారు. శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగాపలువురు మాట్లాడుతూ మండల పరిధిలో ఈ ఏడాది వరి ధాన్యం దిగుబడి తగ్గిందని, వర్షాల్లో తడిసిన ధాన్యం కూడా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రభుత్వ మద్దతు ధరకే తీసుకోవాలన్నారు. నీరు ఎంతవరకు విడుదల చేస్తారో చెబితే రైతులు ప్రత్యామ్నాయ పంటలు ఏర్పాటు చేసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపమండలాధ్యక్షురాలు ప్రశాంతి, తహసీల్దారు మహబూబ్‌బాష, ఎంపీడీవో గిరిజానంపతి, సర్పంచులు, మండల అధికారులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

చాపాడు..: ప్రభుత్వం వరి ధాన్యాన్ని మద్దతు ధరకు ఈ ఏడాది కొనుగోలు చేయలేదని ఏవో మ్యాగి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి మండలాధ్యక్షుడు లక్షుమయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మండలంలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు 12,600 ఎకరాల్లో వరి పైరు సాగు చేసినట్లు చెప్పారు. ఎకరాకు వరి ధాన్యం 30 బస్తాల నుంచి 40 బస్తాల వరకు దిగుబడి వచ్చిందన్నారు. వరి ధాన్యం క్వాలిటీ కూడా బాగుందన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఉద్యాన పంటలు అయిన సపోట, జామ, నిమ్మ, నేరెడు వంటి పంటల సాగుకు సబ్సిడీ ఇస్తున్నట్లు ఏపీవో జగదీశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. పశువుల దాణా, గడ్డిపెంపకం కోసం కూడా సబ్సిడీ ఇస్తున్నామన్నారు. 45 సిమెంటు రోడ్లు , పశువులకోసం 25 షెడ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. మండలంలో 576 డ్వాక్రా మహిళా సంఘాలకు రూ.3 కోట్లు ఇచ్చినట్లు వెలుగు ఏపీఎం శ్రీధర్ చెప్పారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు మార్చిలోపు నిర్మాణం పనులను పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ ప్రమోద్‌కుమార్ కోరారు. తర్వాత బిల్లులు ఇవ్వమన్నారు. 2014-19లో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు కూడా బిల్లులు ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ క్రిష్ణారెడ్డి, ఎంపీడీవో వీరకిశోర్, సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ మండలి బోర్డును పునఃప్రారంభించాలి

బద్వేలు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి బోర్డును పునః ప్రారంభించాలని ఏఐటీయూసీ పట్టణ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి నాగేష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భవచిన నిర్మాణ సంక్షేమ బోర్డును తక్షణచిచిమే పునః ప్రారంభించాలని తలపెడుతూ ఈ నెల 6వ తేదీన కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్షలను చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ రిలే నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని ఆయనకోరారు.

ప్రయోగ పరికరాలకు రూ.30వేలు వితరణ



బద్వేలు, జనవరి3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బాలికల గురుకుల పాఠశాలకు టీడీపీ సీనియర్ నాయకుడు డాక్టర్ కొంకుల రాంబాబు రూ.30వేలు వితరణగా అందించారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సునీత ఆహ్వానం మేరకు రాంబాబుతోపాటు ఆయన సతీమణి కొంకుల విజయకుమారి, కుమార్తె డాక్టర్ నవ్యశ్రీక్రాంతిమయి రూ.30వేలు రూపాయలను చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్,సిబ్బంది వారిని శాలువా కప్పి, పూలమాలలో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో కొంకుల రవి, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌షాపులకు దరఖాస్తుల ఆహ్వానం

కొండాపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో 36 రేషన్‌షాపులకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ గురప్ప తెలిపారు. చామలూరు (ఓసీ), యర్రగుడి(బీసీ, మహిళ), కె.సుగుమంచిపల్లె(ఓసీ), కోనవారిపల్లె(ఎస్సీ), సిరిగే పల్లి (ఓసీ, మహిళ), ఎస్.తిమ్మాపురం (బీసీ,మహిళ), లావనూరు-1(బీసీ-ఇ), లావనూరు(బీసీ-ఏ), పి.అనంతపురం (ఈడబ్ల్యూఎస్), చవ్వనాగాయపల్లె (ఎస్సీ, మహిళ), కొండాపురం-1(ఓసీ, మహిళ), కొండాపురం-2(బీసీ-బి), తిరుమలాయపల్లె (ఎస్టీ), బెడుదూరు (ఓసీ), నేదరపేట (ఎస్సీ), ఎస్.కొత్తపల్లి(ఓసీ), వెంకయ్య కాలువ(బీసీ-ఎ), వెంకయ్యకాలువ-2 (ఓసీ,మహిళ), కె.బొమ్మేపలి (ఓసీ), బి.కొట్టాలపల్లె(ఈడబ్ల్యూఎస్) గండ్లూరు(ఎస్టీ), గంగాపురం (ఓసీ, మహిళ), దత్తాపురం-1(బీసీ-బి), దత్తాపురం-2 (ఓసీ), బుక్కపట్నం(ఓసీ), బ్రహ్మణపల్లె (ఓసీ, మహిళ), కోడూరు-1(బీసీ-డి), కోడూరు-2(ఓసీ),కోడూరు-3(ఎస్సీ), పొట్టిపాడు (ఓసీ), చౌటిపల్లె-2(బీసీ-ఈ), తాళ్లప్రొద్దుటూరు-1(బీసీ, మహిళ), తాళ్లప్రొద్దుటూరు-1 (ఓసీ), సంకేపల్లి(ఎస్సీ, మహిళ), కొండాపురం (ఓసీ), తాళ్ల ప్రొద్దుటూరు(బీసీ, మహిళ) షాపులకు ఈ నెల 8 వతేది లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు 18 నుంచి 40 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండి, ఇంటర్మీడియట్ విద్యార్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ తెలిపారు.

దువ్వూరు..: దువ్వూరు మండలంలో 18 చైకదుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జాన్సన్ తెలిపారు. రిజర్వేషన్ల వారీగా బయనపల్లెకు మాజీసైనికులు, నేలటూరు, క్రిష్ణంపల్లె, పెద్దజొన్నవరం, దువ్వూరు-1, గొల్లపల్లె గ్రామాలకు ఓసీ మహిళలు, దువ్వూరు-2, కానగూడూరుకు ఎస్సీ మహిళలు, చింతకుంట-2కు బీసీ-డి, కానగూడూరుకు క్రీడలకు సంబంధించిన వ్యక్తికి, చిన్నసింగనపల్లెకు బీసీ మహిళ, గుడిపాడు, దువ్వూరు, సి.బయనపల్లెకు జనరల్ కేటగిరి, అంబేడ్కర్‌నగర్, కొత్తచింతకుంట బీసీలకు, జిల్లేళ్ల ఈడబ్ల్యూఎస్, నారాయణపల్లె ఎస్సీలకు రిజర్వేషన్లు కేటాయించినట్లు తెలిపారు. 8వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

రేపు తొగటవీర క్షత్రియ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): శ్రీమత్ పెద్ద అహోబిల క్షేత్ర తొగటవీర క్షత్రియ సేవా సంఘం అన్నసత్రం ఆధ్వర్యంలో పేద తొగటవీర క్షత్రియ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేయనున్నట్లు అన్నసత్రం కమిటీ అధ్యక్షుడు పల్లా శేషయ్య తెలిపారు. శుక్రవారం తమ కార్యాలయంలో స్కాలర్‌షిప్‌ల ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. 5వ తేదీ ఉదయం 10 గంటలకు జమ్మలమడుగు నాగులకట్ట వీధిలోని శ్రీ చౌడేశ్వరీదేవి కల్యాణ మండపంలో స్కాలర్‌షిప్‌లను అందజేస్తామన్నారు. ఈకార్యక్రమంలో అన్నసత్రం కమిటీ ప్రధాన కార్యదర్శి సి.వి.రమణ, కార్యదర్శి పల్లా శంకర్ నారాయణ, ఉపాధ్యక్షుడు కేసీ పుల్లయ్య, గొరిగె రామస్వామి, కోశాధికారి పల్లా నాగమయ్య పాల్గొన్నారు.

వేమన సేవా సమితి ఆధ్వర్యంలో పోటీలు...

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఈనెల 5వ తేదీ అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలోని గ్రేడ్-1 గ్రంథాలయంలో విద్యార్థులకు వేమనపై పోటీలు నిర్వహిస్తున్నట్లు వేమన సేవా సమితి అధ్యక్షుడు వరికూటి సూర్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి గజ్జెల వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో చదివే 3, 4, 5తరగతుల విద్యార్థులు రెండు పద్యాలు, తాత్పర్యాలు చెప్పాలని పేర్కొన్నారు. 6, 7 తరగతుల విద్యార్థులు చిత్రలేఖనంలో వేమన చిత్రాన్ని చిత్రించాలన్నారు. 9, 10 విద్యార్థులకు వ్యాసరచన పోటీల్లో ఆధునిక సమాజంలో వేమన సాహిత్య ప్రభావం అన్న అంశంపై వ్యాసం రాయాలన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, పాల్గొన్న వారికి ప్రోత్రాహక బహుమతులను అందజేస్తామన్నారు.

ఎస్.ఉప్పలపాడును ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దిన విజయానంద్



విజయానంద్ చిత్రపటాన్ని ఊరేగింపుగా తీసుకెళుతున్న దృశ్యం

జమ్మలమడుగు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని ఎస్.ఉప్పలపాడు గ్రామంలో శుక్రవారం రాష్ట్ర చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ (ఐఏఎస్), గ్రామస్థుడు రామమనోహర్‌రెడ్డిని గుర్తు చేసుకుంటూ గ్రామస్థులు వారి చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఎస్.ఉప్పలపాడు గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దారని గ్రామస్థులు తుంగభద్ర హెచ్‌ఎల్‌సీ మాజీ చైర్మన్ శ్రీనివాసులరెడ్డి తదితరులు అభిమానాన్ని చాటుకున్నారు. పై ఇద్దరు స్నేహితులు కావడం, వారు ఒకేచోట చదువుకోవడంతో ఎస్.ఉప్పలపాడు గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. 2015లో విజయానంద్, ఎస్.ఉప్పలపాడు గ్రామాన్ని దత్తత తీసుకుని గ్రామ పెద్దలు మాయలూరి రామమనోహర్‌రెడ్డితో కలిసి నీరు-చెట్టు పథకం, ప్రతి ఇంటికి మరుగుదొడ్లు, సిమెంటు రోడ్లు, గ్రావెల్ రోడ్లు, అంగన్వాడీ సెంటర్లు, వైద్య క్లినిక్ తదితర అన్ని రంగాల్లో గ్రామాన్ని అభివృద్ధి చేశారన్నారు. 2019 ఫిబ్రవరి 19 వ తేదీ అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఎస్.ఉప్పలపాడు గ్రామాన్ని సందర్శించి అవార్డు అందజేశారన్నారు. కాగా విజయానంద్ రాష్ట్ర చీఫ్ సెక్రటరీగా నియమించడం బాధ్యతలు తీసుకొన్న సందర్భంగా గ్రామంలో తప్పెట్లతో మెరువణి జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఉప్పలపాడు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా రితేష్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలు

అట్లూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు నియోజకవర్గం సమన్వయకర్త రితీష్‌రెడ్డి 40వ సంవత్సరం జన్మదిన వేడుకలు మండల టీడీపీ నాయకులు పాపుదిప్పు మల్లికార్జునరెడ్డి, మంచూరి సూర్యనారాయణరెడ్డి, బోవిళ్ల నందగోపాల్‌రెడ్డి, అరవ శ్రీనివాసులరెడ్డి, పోతిరెడ్డి రెడ్డయ్య, మునిరెడ్డి, మణ్యం మహేశ్వర్‌రెడ్డి, పాలకొండు రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అట్లూరు కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు విద్యాసామగ్రి, పండ్లు పంపిణీ చేశారు. రితీష్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా 40 కిలోల కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు మాజీ మండల అధ్యక్షుడు అమర్‌నాథరెడ్డి, యువ నాయకులు జయక్రిష్ణారెడ్డి, ఈశ్వరరెడ్డి, పుల్లారెడ్డి, నరసింహులు, సాంబశివారెడ్డి, మస్తాన్, రాధాక్రిష్ణారెడ్డి, చిన్నరామసుబ్బారెడ్డి, ఎల్.రామక్రిష్ణ, పి.రాజగోపాల్‌రెడ్డి, రఘురాంరెడ్డి, క్రిష్ణారెడ్డి, జేసీబీ సుబ్బారెడ్డి, పరశురాముడు, పెంచలయ్య, విష్ణుకుమారరెడ్డి, రిషికేశవ, శివ, కార్యకర్తలు పాల్గొన్నారు.

బద్వేలు రూరల్..: నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త కె.రితేశ్‌కుమార్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు జహంగీర్‌బాషా ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండులో ఉన్న అనాథవృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కె.వి సుబ్బారెడ్డి, అంబవరం చిన్నసుబ్బారెడ్డి, సిరిగిరిపల్లె ముస్తాఫా, కంభం శివానందరెడ్డి, వి.నరసింహారెడ్డి, రఫీ, కేశవపాల్గొన్నారు.

బద్వేలు టౌన్..: నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం అభిమానులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో రక్తదానశిబిరం, కేక్ కట్‌చేసి అనాథశరణాలయం, ప్రభుత్వాసుపత్రుల్లో రోగులకు బ్రెడ్‌లు, పండ్లు పంపిణీచేశారు. ఆయన అభిమానులు పలుదేవాలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, రాగిమాను ప్రతాప్‌కుమార్, కనుమర్లపూటి ప్రసాద్, జహంగీర్‌బాషా, జగదీశ్వరరెడ్డి, మాచుపల్లె వెంకట క్రిష్ణారెడ్డి, లోయర్‌సగిలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ ఈగ వెంకటరమణారెడ్డి, ఈగ సుబ్బారెడ్డి, ఈగ సుమన్‌రెడ్డి, ఏఓ సుధాకర్‌రెడ్డి, మిత్తికాయల రమణ, శివానందరెడ్డి, వెంగలశ్రీనివాసులరెడ్డి, మద్దిరెడ్డి, బోవిళ్ల విష్ణు, జీవి సుబ్బారెడ్డి, మాచుపల్లె లక్ష్మీదేవి, కొలవలి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.







అట్లూరు.. రితేష్‌రెడ్డి జన్మదినం సందర్భంగా విద్యార్థినులకు పండ్లు, విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న మల్లికార్జునరెడ్డి, బద్వేలులో వృద్ధులకు భోజనం ప్యాకెట్లు పంపిణీచేస్తున్న జహంగీర్‌బాషా, బద్వేలులో రక్తదానం చేస్తున్న అభిమానులు